ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
7
గురువారం 25 సెప్టెంబరు 2025





డైట్ హాస్టల్ వద్ద డ్రైనేజీ పొంగడంతో ఇంటి కింద కోతకు గురైన దృశ్యం

## వైభవంగా పవిత్రాల సమర్పణ

గుర్రంకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామికి బుధవారం పవిత్రాలను వేదపండితులు వైభవంగా సమర్పించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. ఆలయంలో విశేష పూజలందుకున్న పవిత్రాలను వేదపండితులు ఉత్సవమూర్తులకు అలంకరించారు. పవిత్ర మాలలు ధరించి స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, గోకుల్, వెంకీ, ధనుష్, ఆలయాధికారి కృష్ణమూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



నరసింహస్వామికి సమర్పించిన పవిత్రాలు

# పేరుకే స్పెషల్..

- స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో అస్తవ్యస్త డ్రైనేజీ
- చిన్నపాటి వర్షానికి పొంగుతున్న మురుగు కాలువలు
- భారీ వర్షానికి డ్రైనేజీలో కొట్టుకుపోయి నలుగురు బలి
- ఎక్కడ చూసినా మురుగు కాల్వలపై అక్రమ కట్టడాలు
- జిల్లా కేంద్రమైనా వసతులు నిల్...
- కూటమి ప్రభుత్వంలోనైనా రాయచోటి మారేనా...?



రాయచోటి పట్టణంలోని కొత్తపేట పిండి మిషన్ వీధిలో డ్రైనేజీ పైనే నిర్మించిన ఇల్లు

**వాగులు లేవు, వంకలు లేవు, ప్రతినిత్యం ఉప్పొంగి ప్రవహించే నదులు అంతకన్నా లేవు. ఊహించని విధంగా రాయచోటి పట్టణంలో కురిసిన భారీ వర్షానికి డ్రైనేజీలన్నీ ఉప్పొంగి నలుగురి ప్రాణాలను బలిగొన్నాయి. గ్రామ పంచాయతీగా ఉన్న రాయచోటి పట్టణం మున్సిపాలిటీగా ఏర్పడిన అనంతరం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు నాసిరకంగా డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టారు. ఏళ్లు కావస్తున్నా డ్రైనేజీలను మార్చకపోవడంతో మురుగు నీరు, చెత్తాచెదారంతో నిండిపోయి వర్షం వచ్చిన సమయంలో వరద నీరంతా రోడ్లపై ప్రవహిస్తూ లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరుతున్నాయి. రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ పన్నులు, ఇళ్ల నిర్మాణాల చార్జీలు పెరిగాయే తప్ప మౌలిక సౌకర్యాలు మాత్రం కల్పించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.**



రాయచోటి పట్టణంలోని నాలుగు కుళాయిల వద్ద ప్రధాన డ్రైనేజీ పై అక్రమ కట్టడం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో అసలు చిన్న చిన్న డ్రైనేజీలు.. పైగా వాటిని ఆక్రమించి అక్రమ కట్టడాలు వెలుస్తుండడంతో వరదలు వచ్చిన సమయంలో డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లక మనుషుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. మున్సిపాలిటీలో ఏ వార్డుకు వెళ్లి చూసినా డ్రైనేజీలపైన అక్రమ కట్టడాలు దర్శనమిస్తాయి. ఇళ్ల నిర్మాణ సమయంలో మున్సిపాలిటీ నిబంధనలను ఎవ్వరూ పాటించడం లేదు. ఇళ్లు నిర్మించేవారు వారి స్థలం వరకు పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టి ఇళ్ల ముందు స్టెప్స్ గేట్లు ఇలా ప్రతి ఒక్కటి రోడ్డుపైన నిర్మించడమే కాకుండా బండలు వేసి మొక్కలు పెంచి రోడ్డును పూర్తి స్థాయిలో రెండు వైపులా ఆక్రమించడంతో మ్యాప్‌లో 20 అడుగులు ఉన్న రోడ్డు 10 నుంచి 12 అడుగులకు కుచించుకుపోతున్నాయి. ఫలితంగా పెద్ద పెద్ద వాహనాలు వీధుల్లోకి వెళ్లేందుకు కూడా నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని వీధుల్లో అయితే డ్రైనేజీలను అక్రమించి స్టెప్స్ కట్టి మురుగునీరు సక్రమంగా వెళ్లనివ్వకుండా చెత్తాచెదారం అందులోనే వేస్తుండడంతో వర్షం వచ్చిన సమయంలో మురుగునీరు అంతా రోడ్లపైకి ప్రవహించి పాదచారులకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. దీనికి తోడు వెలిగల్లు నీరు వచ్చిన సమయంలో కొన్ని వీధుల్లో నీరంతా కుళాయిలు తిప్పేసి రోడ్లపైకి వదులుతుండడంతో సిమెంటు రోడ్లు నీటితో తడిసి దెబ్బతింటున్నాయి. ఆక్రమణలను తొలగించాల్సిన మున్సిపాలిటీ యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో వాహనదారులు, పాదచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధానంగా రాయచోటి మున్సిపాలిటీలోని నాలుగు కుళాయిల వద్ద, పిండి మిషన్‌వీధి, సాయిరాంవీధి, కొత్తపేట, ఎస్ఎన్ కాలనీలోని వెంకటేశ్వరవీధి, గవర్నర్ కల్యాణ మండపం ప్రాంతంలో డ్రైనేజీలను పూర్తి స్థాయిలో ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారు. వర్షం వచ్చిన సమయంలో డ్రైనేజీ నీరు పోవడానికి అవకాశం లేక నీరంతా పొంగిపొర్లడంతో ఇళ్లలోకి, రోడ్లపైకి వస్తుండడంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో, ఎక్కడ రోడ్డు ఉందో అర్థం కాని పరిస్థితుల్లో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. గత శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెత్తాచెదారంతో నిండిపోయిన డ్రైనేజీలు పొంగి పొర్లడంతో నలుగురు మృత్యువాతపడ్డారు. దీనికి తోడు నాలుగు కుళాయిల సమీపంలోని ప్రధాన డ్రైనేజీ కాలువపైన పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో వరద నీటి తాకిడికి ఒక ఇంటి కింది భాగంలో బేస్‌మట్టం పూర్తి స్థాయిలో కొట్టుకుపోయింది. అంతేగాక పిండి మిషన్ వీధిలో డ్రైనేజీపైనే స్టెప్స్ కట్టి ఆక్రమించినప్పటికీ ప్రతినిత్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై పలువురు పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేటలో మున్సిపాలిటీ బైలాలో 8 అడుగులు ప్రధాన డ్రైనేజీగా చూపిస్తున్న స్థలాన్ని ఆక్రమించి పెద్ద భవనం నిర్మించినా అధికారులు మాత్రం తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ గత ప్రభుత్వం చేసిన పాపాలు రాయచోటి మున్సిపాలిటీ ప్రజలకు శాపాలుగా మారుతున్నాయని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా రాయచోటి మున్సిపాలిటీలోని ఆక్రమణకు గురైన డ్రైనేజీ కాలువల ప్రక్షాళన జరిగేనా అనే ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.



రాయచోటిలోని కొత్తపేట పిండి మిషన్ వీధిలో మురుగు కాలువపై వెలిసిన తాపలు

### డ్రైనేజీ ఆక్రమణలపై సర్వే చేస్తున్నాం

రాయచోటి మున్సిపాలిటీలో డ్రైనేజీ కాలువల ఆక్రమణలపై సర్వే చేస్తున్నాం. ఇటీవల జరిగిన సంఘటనల దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి ప్రతి వీధిలో డ్రైనేజీల ఆక్రమణలపై సర్వే నిర్వహిస్తున్నాం. రెవెన్యూ రికార్డుల ప్రకారం డ్రైనేజీలు ఆక్రమణలకు గురయ్యాయా, రికార్డుల ప్రకారం ఎన్ని అడుగులు ఉంది తదితర అంశాలపై ఆరా తీస్తున్నాం. సర్వే పూర్తయిన వెంటనే రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న డ్రైనేజీల్లో ఆక్రమణలు ఉంటే నివేదికలను ప్రభుత్వానికి అందజేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- రవికుమార్, మున్సిపల్ కమిషనర్, రాయచోటి



## న్యాయం చేయండి

- భర్త అన్న ఇంటి ముందు భార్య దీక్ష



తనకు న్యాయం చేయాలని ఇద్దరు పిల్లలతో భర్త అన్న ఇంటి ముందు కూర్చున్న బాధితురాలు

నందలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తన తండ్రి ఆస్తిలో వాటా కోసం తనను భర్త దూరం పెట్టాడని, తనకు న్యాయం చేయాలని భర్త అన్న ఇంటి ముందు భార్య దీక్షకు కూర్చున్న సంఘటన బుధవారం మండలంలోని పాటూరులో జరిగింది. బాధితురాలి వివరాల మేరకు... ఓబులవారిపల్లె మండలం ఎల్లాయపల్లె గ్రామానికి చెందిన జయలక్ష్మికి మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన కుంచం సురేశ్‌తో 8 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సురేశ్ జీవనోపాధి గల్ఫ్ దేశమైన ఖత్తర్‌కు వెళ్లాడు. అతడి అమ్మ నాన్న ఇద్దరూ లేకపోవడంతో అతడు ఇండియాకు వచ్చినపుడు తన అన్న ఇంట్లోనే ఉండేవాడు. దీంతో జయలక్ష్మి తన పుట్టింట్లో ఉంటుంది. తన మామ ఆస్తి కావాలని సురేశ్ భార్యతో గొడవ పెట్టుకుని సుమారు ఆరు నెలల నుంచి జయలక్ష్మికి డబ్బులు పంపడం గాని, మాట్లాడటం గాని చేయడం లేదు. నెల రోజుల కిందట భర్త ఇండియాకు వచ్చిన విషయం తెలిసి భర్తకు ఫోన్ చేయగా ఆస్తిలో తనకు ఎక్కువ భాగం ఇస్తేనే సంసారానికి తీసుకుని వస్తానని తెగేసి చెప్పాడు. దీంతో జయలక్ష్మి పాటూరు గ్రామానికి వచ్చి సురేశ్ అన్న ఇంటి ముందు కూర్చుంది. ప్రస్తుతం ఆ ఇంటి దగ్గర ఎవరూ లేరు. ఆమె భర్త కూడా ఎక్కడో ఉన్నాడు. భార్యాభర్తల మధ్య గొడవ రావడానికి కారణం సురేశ్ అన్న కుంచం గోపాలకృష్ణయ్య అని జయలక్ష్మి ఆరోపిస్తోంది. తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరుతోంది. విషయం తెలుసుకున్న నందలూరు పోలీసులు అక్కడికి చేరుకుని ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే మీకు న్యాయం జరుగుతుందని ఆమెకు నచ్చచెప్పి పంపించివేశారు.

## భూమి కేటాయింపుపై ప్రతిపాదనలు పంపండి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏపీఎస్‌పీసీఎల్)కి లీజు ప్రాతిపదికన భూముల కేటాయింపునకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే పంపించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడలోని సీసీఎల్ఏ జయలక్ష్మి ఆధ్వర్యంలో సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో భూకేటాయింపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి తదితర అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ గాలివీడు సోలార్ ప్రాజెక్టు నిర్మాణం కోసం గతంలో భూమి కేటాయింపు ప్రతిపాదనను సమర్పించారు. గాలివీడు సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన తూముకుంట, వెలిగల్లుకు సంబంధించిన లీజు ప్రక్రియ పనులను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం తయారు చేసి ఫైళ్లను వేగవంతం చేయాలని, శనివారం లోపు నివేదికలను పంపే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## చిత్రహింసలు భరించలేకున్నా..

- ఇండియాకు రప్పించండి... లేదంటే ఇక్కడే సచ్చిపోతా
- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నారా లోకేశ్‌లకు మహిళ వేడుకోలు



నాగవేణి

ములకలచెరువు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్రహింసలు భరించలేకున్నాను...తీవ్ర అనారోగ్యానికి గురయ్యాను... ప్రతిరోజు ఐదంతస్థులు ఎక్కి దిగమంటున్నారు...ఎక్కి దిగేటప్పుడు పడిపోతున్నా...కడుపు నిండా అన్నం కూడా పెట్టడం లేదు...నా వయస్సు 64 ఏళ్లు.. కుటుంబ పరిస్థితి బాగా లేక కువైట్‌కు వచ్చాను... ఇక్కడ పనులు చేయలేకున్నా...ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఎలాగైనా నన్ను ఇండియాకు వచ్చేలా చూడండి అంటూ కువైట్‌లో ఉన్న మహిళ భోరున విలపిస్తోంది. అక్కడ మహిళ పడుతున్న కష్టాలను కుటుంబ సభ్యులకు వీడియోలు పంపుతుండడంతో కంటకడి పెట్టుకుంటూ ఆవేదన చెందుతున్నారు. కుటుంబీకుల కథనం మేరకు... ములకలచెరువు మండలం నాయనిచెరువుపల్లె పంచాయతీ పోకనాటివారిపల్లెకు చెందిన బత్తల రమణప్ప, నాగవేణికి కుమారుడు అశోక్ కుమార్, కుమార్తె శ్రీలక్ష్మి ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో కూలిపనులు చేసుకుంటూ రమణప్ప, నాగవేణిలు కుటుంబాన్ని పోషించేవారు. రమణప్ప తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో చికిత్సలు, కుటుంబ పోషణ కోసం మూడేళ్ల క్రితం నాగవేణి కువైట్‌కు వెళ్లింది. అక్కడ పనిచేస్తున్న చోట సేట్ కుమారుడు బ్యాటుతో నెత్తిన కొట్టడంతో అనారోగ్యానికి గురికావడంతో ఇండియాకు పంపించేశారు. ఈ క్రమంలో అప్పులు చేసి కుమార్తె శ్రీలక్ష్మికి ఆరు నెలల క్రితం పెళ్లి చేశారు. అప్పులు తీర్చలేకపోవడంతో పాటు తిరిగి మూడు నెలల క్రితం నాగవేణి మళ్లీ కువైట్‌కు వెళ్లింది. అక్కడ ప్రతిరోజూ ఐదంతస్థుల భవనం ఎక్కలేక తీవ్ర అనారోగ్యానికి గురైంది. దీనికి తోడు భోజనం పెట్టకపోవడంతో పాటు మందులు కూడా ఇవ్వడం లేదు. పనులు చేయాలని చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఇండియాకు వచ్చేయాలని ఏజెంటుకు ఫోన్ చేస్తే రూ.2 లక్షలు టికెట్‌కు కడితే ఇంటికి పంపుతామని చెబుతున్నాడని...డబ్బులు కట్టే పరిస్థితిలో లేనని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నారా లోకేశ్‌లు చొరవ తీసుకుని ఇండియాకు రప్పించాలని లేదంటే ఇక్కడే చచ్చిపోతానని నాగవేణి విలపిస్తోంది. నాగవేణిని ఇంటికి వచ్చేలా చూడాలని భర్త రమణప్ప, కుమారుడు అశోక్‌కుమార్, కుమార్తె శ్రీలక్ష్మి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## అగ్నిప్రమాదాల్లో రూ.66.60 కోట్ల ఆస్తిని కాపాడాం

- చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లి 14 మంది మృతి
- జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్

ములకలచెరువు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జరిగిన అగ్ని ప్రమాదాల్లో రూ.66.60 కోట్ల ఆస్తిని కాపాడామని జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక అగ్నిమాపక కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 116 అగ్ని ప్రమాదాలు జరిగి రూ.17.50 కోట్లు నష్టం వచ్చిందన్నారు. చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లి 14 మంది మృతి చెందగా ఐదుగురిని కాపాడినట్లు తెలిపారు. అలాగే నాలుగు పశువులను కాపాడామన్నారు. ఈ తనిఖీల్లో అగ్నిమాపక కేంద్రం అధికారి వీరభద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## అమరావతికి డీఎస్సీ అభ్యర్థులు



బస్సులను ప్రారంభిస్తున్న డీఆర్వో, డీఈవో తదితరులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025కు ఎంపికైన అభ్యర్థులు అమరావతికి ప్రయాణమయ్యారు. 43 బస్సుల్లో 1,666మంది అభ్యర్థులు వారి కుటుంబ సభ్యులు బయలుదేరారు. బుధవారం కడప నగరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన 869 మందిలో 820 మంది అభ్యర్థులు వారి కుటుంబ సభ్యు లతో కలిపి మొత్తం 1,666 మంది, 122 మంది సిబ్బంది, 15 మంది పోలీసుల భద్రతతో అమరావతికి బయలుదేరారు. ఈ బస్సులను డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి సెక్రటేరియట్ ప్రాంగణంలో గురువారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారని చెప్పారు. ఎంపికైన 869 మందిలో 637 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు కాగా మిగతా వారు టీజీటీలు, పీఈటీలని చెప్పారు. డీఎస్సీ చైర్మన్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, వైస్ చైర్మన్ జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌లకు జిల్లా విద్యాశాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.



బాయ్ బాయ్ చెబుతున్న డీఎస్సీ అభ్యర్థులు

## అన్నపూర్ణా దేవీ...పాహిమాం...

- వేడుకగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- వీరభద్రాలయంలో అమ్మవారికి గాయత్రిదేవి అలంకారం



మదనపల్లె కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో మీనాక్షి దేవి అలంకరణలో అమ్మవారు





రాజంపేట వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం



వీరభద్రాలయంలో గాయత్రిదేవి అలంకారంలో భద్రకాళీ అమ్మవారు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నపూర్ణా దేవి పాహిమాం... మా మొర ఆలకించి మము బ్రోవుమమ్మా' అంటూ అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన బుధవారం జిల్లాలోని పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమివ్వగా మహిళలు పెద్దఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పీలేరులోని నెహ్రూ బజారులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు మీనాక్షి అలంకరణలో దర్శనమిచ్చారు. రౌద్రాల అంకాళమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. మదనపల్లె కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో మీనాక్షీ దేవి అలంకరణ, కోర్టులో గంగమ్మ ఆలయంలో అమ్మవారు స్వర్ణకవచ అలంకరణలో గంగమ్మ దర్శనమిచ్చారు. గుర్రంకొండ రెడ్డెమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, రాజంపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు దర్శనం ఇచ్చారు.



అన్నపూర్ణాదేవి అలంకరణలో పీలేరు రౌద్రాల అంకాళమ్మ



కోర్టులో గంగమ్మ ఆలయంలో స్వర్ణకవచ అలంకరణలో గంగమ్మ



అన్నపూర్ణాదేవిగా గుర్రంకొండ రెడ్డెమ్మ అమ్మవారు

# ఆవుల రాబడి పెంపు

**ఆవుల పెంపకంతో ఆదాయం ● పల్లెల్లో పొంగుతున్న పాలధార**


రైతు డెయిరీలో ఉన్న పలురకాల జాతుల ఆవులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆవుల పెంపకం బాగా పెరుగుతోంది. ఆవుపాలు శ్రేష్ఠంగా భావించడంతో వీటికి రోజు రోజుకు డిమాండ్ పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల పాడి రైతులు రకరకాల ఆవులను తీసుకుని వచ్చి పెంచుతున్నారు. తద్వారా వచ్చే పాలను పాలకేంద్రాలకు తరలించి ఆదాయం పొందుతున్నారు.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కువగా ఉద్యాన పంటలపై ఆధారపడి ఉన్నారు. తరచూ నష్టాలు రావడం, చీడపీడలు ఎక్కువ కావడం, ప్రకృతి వైపరీత్యాలు తదితర కారణాలతో ఉద్యాన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో ఉద్యాన రైతులు చాలామంది పాడి రైతులుగా మారుతున్నారు. ఉన్న పొలంలోనే షెడ్లు వేసుకుని ఆవులను పెంచుకుంటూ ఆదాయం పొందుతున్నారు. ఆవులు, గేదెల పెంపకాన్ని కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆవులు, గేదెల పాలు సేకరించి కొందరు తిరుపతి, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాల్లోని పాల కేంద్రాలకు తరలిస్తున్నారు. ఒక్క లీటరు ఆవు పాలు రూ.25 నుంచి రూ.30కి అమ్ముతున్నారు. గేదె పాలను మాత్రం స్థానికంగానే అమ్ముతున్నారు. కొందరు వ్యాపారులు పాలను పాడి రైతుల నుంచి సేకరించుకుని రైల్వేకోడూరు పట్టణంలో అమ్ముతున్నారు. ఒక్క ఆవుకు రోజు సగటున గడ్డి, పోషకాలు రూ.100 ఖర్చు వస్తోందని పాడి రైతులు చెబుతున్నారు.

ఒంగోలు, పుంగనూరు, నాటు, గిర్, జల్లికట్టు, జెర్సీ, తార్‌పాల్, శాషివాల రకం ఆవులతో పాటు, నాటు ఎనుములు, షాడో, కాంక్రేజ్ తదితర రకాల గేదెలను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుని పాడిని జీవనాధారంగా చేసుకుంటున్నారు. పశు సంవర్ధక శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. రైల్వేకోడూరు మండలంలోని పొట్టిరాజుగారిపల్లెలో పద్మ అనే మహిళ సుమారు 100కు పైగా వివిధ రకాల ఆవులు, గేదెల పెంపకం చేపట్టారు. రోజుకు దాదాపు 150లీటర్ల పాలు అమ్ముతున్నారు.

### రోజుకు 58,600 లీటర్ల పాలు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో చుక్క ఎనుములు, నాటు ఆవులు కలిపి 25,544 ఉన్నాయి. క్రాస్‌బ్రీడ్ ఆవులు, దేశీయ ఆవులు కలిపి 19,215 ఉన్నాయని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో సుమారు 6 వేల మంది పాడి రైతులు ఉన్నారు. ప్రతి రోజు ఆవులు, గేదెలు కలిపి 58,600 లీటర్ల పాల ఉత్పత్తి ఉంది. ఇందులో ఇంటి అవసరాలకు 11,000 వేల లీటర్లు, ప్రైవేటు డెయిరీలకు 23,000 లీటర్ల పాలను సరఫరా చేస్తున్నారు. మిగిలిన పాలను స్థానికంగానే అమ్ముతున్నారు.

### పాలిచ్చే వాటిని ఎంపిక చేసుకోవాలి

ప్రస్తుతం పాడి రైతులు చుక్క ఎనుములు, నాటు ఆవులు, క్రాస్‌బీడ్ ఆవులు, దేశీయ జాతులకు చెందిన ఆవుల పెంపకాన్ని మొదలు పెట్టారు. పాలిచ్చే పశువులను పాడి రైతులు ఎంపిక చేసుకోవాలి. పాల దిగుబడి పెంచుకుంటే పాడి రైతులకు ఆదాయం ఉంటుంది.

- ప్రతాప్, రైల్వేకోడూరు మండల పశువైద్యాధికారి

### గోరక్షణతో సంతృప్తి



ఆదాయం కంటే గోరక్షణతో ఆత్మ సంతృప్తి ఉంటుంది. గేదెలు, జెర్సీ ఆవులు, నాటు ఆవులు 100కు పైగా ఉన్నాయి. వాటి సంరక్షణకు 30 మంది కూలీలను పెట్టుకున్నాం. గోవులను పెంచడం ద్వారా మా కుటుంబానికి మంచి జరుగుతోంది.

- పద్మ, మహిళా పాడి రైతు, పొట్టిరాజుగారిపల్లె


షాడో రకం ఆవు


జల్లికట్టు ఎద్దు

## రెడ్డెమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణం స్వీకారం చేస్తున్న చైర్మన్, పాలకవర్గ సభ్యులు

గుర్రంకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మ ఆలయ చైర్మన్‌గా లంకిపల్లె రాజన్ననాయుడు బుధవారం ప్రమాణం చేశారు. ఆలయ పాలకవర్గ సభ్యుల చేత దేవదాయశాఖ అధికారి శశికుమార్ ప్రమాణం చేయించారు. ఆలయ చైర్మన్‌గా రాజన్ననాయుడు, పాలకవర్గ సభ్యులుగా గాయత్రి, ఆశాజ్యోతి, అంజికుమార్, శ్రీనివాసుల నాయుడు, కిరణ్, యశోదమ్మ, పుణ్యవతి, ప్రభాకర్, గోవిందమ్మ, ప్రకాశ్ చేత ప్రమాణం చేయించారు. చైర్మన్ రాజన్ననాయుడు మాట్లాడుతూ రెడ్డెమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. అమ్మవారి కీర్తిని విస్తరింపజేయడానికి అన్నివిధాలా పనిచేస్తామన్నారు. ఆలయంలో భక్తులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవో మంజుల, నేతలు జగదీష్‌కుమార్, రెడ్డిప్రసాద్‌నాయుడు, దద్దాల హరిప్రసాద్ నాయుడు, ఎల్లుట్ల మురళీ, చలమారెడ్డి, టి.కృష్ణమ నాయుడు, బాబాజాన్, ప్రదీప్, జయసూరి, నాగేంద్ర, మహాత్మారెడ్డి, ఆనంద్, రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతి చెందిన లక్ష్మయ్య

లక్కిరెడ్డిపల్లె/సీకే దిన్నె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని దప్పేపల్లి పంచాయతీ డి.రామాపురానికి చెందిన ఈశ్వరయ్య, కొప్పుల లక్ష్మయ్య కడప నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తుండగా ఘాట్‌లోని 5వ మలుపు వద్ద వేగంగా వస్తున్న లారీలో నుంచి డ్రైవర్ కిందకు దూకడాన్ని గమనించి బైకును పక్కన పడేసి పరుగెడుతుండగా లారీ వారిపైకి దూసుకెళ్లింది. కొప్పుల లక్ష్మయ్య (65) అక్కడికక్కడే మృతి చెందగా ఈశ్వరయ్య గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. చింతకొమ్మదిన్నె పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు లక్ష్మయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మరణంతో దప్పేపల్లి గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన చింతకొమ్మదిన్నె సీఐ బాలమద్దిలేటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పొలం విషయంలో వృద్ధ దంపతులపై దాడి

**● అవమానంతో వృద్ధుడి ఆత్మహత్యాయత్నం**


చికిత్స పొందుతున్న రెడ్డెప్ప

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వృద్ధ దంపతులపై చేసిన దాడిని అవమానంగా భావించిన వృద్ధుడు కోలా రెడ్డెప్ప (82) ఇంటి వద్దకు వచ్చి క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యకు యత్నించాడని పోలీసులు తెలిపారు. తాలుకా పోలీసులు కథనం మేరకు మదనపల్లె మండలం కొత్తవారిపల్లె గ్రామం ఎనుములవారిపల్లె వాసి కోలా రెడ్డెప్ప, అతడి భార్యపై అదే గ్రామానికి చెందిన వేణు, అతడి భార్య కాంతమ్మ, ఉదయ్ అతడి భార్య రేణుక, జగదీష్ (నాని), దాడి చేసి గాయపర్చారు. 2023లో తన కుమారుడు సోముశేఖర్ పేరిట గుర్రప్ప వద్ద 63 సెంట్లు కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నట్లు బాధితుడు తెలిపారు. అదే గ్రామానికి చెందిన వేణు వర్గీయులు ఆ భూమిని తమకు అమ్మాలని అడిగారు. ఇవ్వమని తెలపడంతో బుధవారం పొలం పనులు చేస్తున్న వృద్ధులపై దాడి చేశారు. తాము కొనుగోలు చేసిన పొలంలోకి దౌర్జన్యంగా జొరబడి దాడి చేశారని బాధితుడు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధ దంపతులపై చేసిన దాడిని అవమానంగా భావించిన వృద్ధుడు ఇంటి వద్దకు వచ్చి క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 9 మంది తమిళ స్మగ్లర్లు అరెస్ట్

● 12 దుంగలు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి


పట్టుబడ్డ స్మగ్లర్లు, దుంగలతో ఎస్పీ ధీరజ్, పోలీసు సిబ్బంది

రాయచోటిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పరిధిలోని టి.సుండుపల్లె మండలం మాచిరెడ్డిగారిపల్లె అటవీ ప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న 9 మంది తమిళ స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.34.40 లక్షల విలువ చేసే 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ ధీరజ్ కునుబల్లి ఎర్రచందనం స్మగర్ల అరెస్టులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఆర్ఎస్‌టీఎఫ్ సీఐ మధు, కలికిరి సీఐ అనిల్‌తో పాటు టి.సుండుపల్లె పోలీసులు, ఆర్ఎస్‌టీఎఫ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సుండుపల్లె మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లెకు సమీపంలోని తొగురుపల్లి క్రాస్‌కు సమీపంలోని తొగురుపల్లి క్రాస్ వద్ద ఎర్రచందనం దొంగల కోసం కాపు కాపు కాశారని ఎస్పీ తెలియజేశారు.

ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో మాచిరెడ్డిగారిపల్లె వైపు నుంచి ఒక కారు రాగా స్మగ్లర్లు మామిడి తోట నుంచి ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేయడానికి ప్రయత్నించారన్నారు. అప్పటికే నిఘాలో ఉన్న పోలీసు బృందాలు వారిని అడ్డుకోవడానికి ముందుకు వెళ్లగా కొంత మంది కారులో ఎక్కి పోలీసులను ఢీకొట్టే ప్రయత్నం చేసి తప్పించుకున్నారన్నారు. అయితే పోలీసులు వారిని వెంబడించి తమిళనాడు రాష్ట్రానికి చెందిన బాకియారాజ్, రజిత్‌కుమార్‌గోవిందన్, స్వామినాధన్, సురేశ్ కుమార్ శివకుమాదర్, దురై స్వామి, రాజామణి, పరశాంతు చంద్రన్, రాజా విజయ్‌కుమార్, తిరుమలై చిన్నయాన్ అనే 9 మంది ఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులు వెంటాడి పట్టుకున్నారన్నారు. వారి వద్ద నుంచి 34.40 లక్షల విలువ గల 344 కిలోల బరువు గల 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపెట్టనున్నట్లు ఎస్పీ వివరించారు. పారిపోయిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.

## తలకోన వద్ద 10 ఎర్రచందనం దుంగల స్వాధీనం


పట్టుబడిన స్మగ్లరు, వాహనం, దుంగలు

పీలేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న తమిళనాడుకు చెందిన స్మగ్లరుతో సహా ఒక వాహనం, 10 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు... తలకోన అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం ఉదయం తిరుపతి జిల్లా యల్లమంద, చిత్తూరు జిల్లా పులిచెర్ల, మంగళంపేట రోడ్డు మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో పులిచెర్ల మార్గంలో వేగంగా వస్తున్న ఒక ఫోర్డు ఎకోస్పోర్టు(ఏపీ03 బీజే 1555) వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 10 ఎర్రచందనం దుంగలు గుర్తించినట్లు తెలిపారు. దీంతో ఆ వాహనంతో సహా అందులో ఉన్న తమిళనాడు రాష్ట్రం, సేలం జిల్లా తెక్కంపట్టి గ్రామానికి చెందిన ఇళయరాజాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దాడిలో ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్ఎస్‌వో ప్రకాశ్ కుమార్, ఎఫ్‌బీవోలు ప్రతాప్, రెడ్డిప్రసాద్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

## ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్త ఉద్యమం

**● బాస్ నేషనల్ కో-ఆర్డినేటర్ దుర్గం సుబ్బారావు**


మాట్లాడుతున్న దుర్గం సుబ్బారావు

మదనపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల సాధనకోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టనున్నట్లు బాస్ నేషనల్ కో-ఆర్డినేటర్ దుర్గం సుబ్బారావు ప్రకటించారు. పూనా ఒప్పంద దుర్దినం సెప్టెంబరు 24వ తేదీని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో బాస్, వీసీకే పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో 'రాజ్యాంగం-రాజకీయ హక్కులు-ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రైవేటు రంగంలో ప్రాతినిధ్య రిజర్వేషన్లను గురించి సమగ్రంగా వివరించారు. వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ పోరాడి సాధించిన ప్రత్యేక నియోజకవర్గాలను పూనా ఒప్పందంలో కోల్పోయామన్నారు. ప్రముఖమైన, ప్రధానమైన వివిధ రంగాలను ప్రైవేటుపరం చేయడంతో 85 శాతం విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రైవేటు రంగంలోకి వెళ్లిపోయాయని, ప్రభుత్వం వద్ద ఉన్న 15 శాతం కూడా ఆ వర్గాలకు దక్కలేదని వివరించారు. ఆ అవకాశాలు పూర్తిస్థాయిలో అర్హులకు దక్కేలా దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు. సమావేశంలో కె.వి.రమణ, పల్లం తాతయ్య, ముత్యాల మోహన్, పి.శ్రీనివాసులు, కడప రమణ, నంద్యాల శ్రీపతి, నీరుగట్టి రమణ, పీర్‌బాషా, వి.దొరస్వామి, ఓబులేసు, కర్ణాటక మునెప్ప, మునివెంకటప్పతో పాటు అన్నమయ్య, చిత్తూరు, కడప, తిరుపతి, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన వీసీకే, బాస్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మొటుకుపల్లె చెరువుకు గండి

**● మరమ్మతులు చేసిన స్థానికులు**


చెరువు కట్టకు మరమ్మతు పనులు చేస్తున్న రైతులు

మదనపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మొటుకుపల్లె-ముడివారిపల్లె సమీపంలోని వాయలపాటువానిచెరువుకు గండి పడింది. కర్ణాటక సరిహద్దు అటవీ ప్రాంతంలో ఇటీవల వర్షాలు ఎక్కువగా కురిశాయి. దీంతో పైప్రాం తం నుంచి వచ్చిన వర్షపునీటితో చెరువునిండి మొరవపోయింది. అయితే అప్పటికే చెరువుకట్ట బలహీనంగా ఉండడంతో వర్షపు నీరు చేరడంతో లీకేజీ ప్రారంభమైంది. రైతు లు దీనిని మొదట్లో సాధారణ లీకేజీగా పరిగణించారు. అయితే పైప్రాంతంలోని కొండలు, గుట్టల నుంచి నీరు యధావిధిగా రావడంతో లీకేజీ అంతకంతకూ పెరుగుతూ గండి పడింది. దీనిని గమనించిన స్థానిక రైతులు ఈ విషయాన్ని మొటుకుపల్లె టీడీపీ నేత, రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి మొటుకుపల్లె శివ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన సొంత నిధులు వెచ్చించి తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. ఇందులో భాగంగా ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌తో మట్టిని తరలించి స్థానిక రైతుల సహకారంతో గండిని పూ డ్చి నీటి లీకేజీని ఆపేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇందులో మొటుకు శి వ, శంకర్, అంజనప్ప, సోమశేఖర్, వెంకటరణ, బద్దుల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. భవిష్య త్తు వర్షాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## వజ్రాల వంకపై పైపుల ఏర్పాటు



వజ్రాల వంకపై పైపులు వేస్తున్న దృశ్యం

పీలేరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం ఎంపీపల్లె పంచాయతీ చెరువుకిందపల్లె వద్ద ఉన్న వజ్రాల వంకపై సిమెంటు పైపుల ఏర్పాటు ప్రక్రియను అధికారులు చేపట్టారు. చెరువుకిందపల్లెకు రోడ్డు సౌకర్యం లేకపోవడం, ఉన్న మట్టి రోడ్డు కూడా ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన వైనాన్ని ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'దారిద్ర్యం' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. చెరువుకిందపల్లె దుస్థితిపై మండల స్థాయి అధికారులు స్పందించారు. రాయచోటి నుంచి సిమెంటు పైపులను తెప్పించి తెగిపోయిన వజ్రాల వంక కాజ్‌వేపై ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు గురువారం సాయంత్రానికి కొలిక్కి వచ్చి తమకు దారి సౌకర్యం కలుగుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## యూరియా కోసం ఎగబడ్డ రైతులు


బి.కొత్తకోటలో యూరియా కోసం క్యూలో రైతులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోటలోని గ్రోమోర్ కేంద్రంలో యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత ఉండటంతో వరి, మొక్కజొన్న సాగుచేసిన రైతులు యూరియా కోసం వేచి చూస్తున్నారు. బుధవారం బి.కొత్తకోటలోని గ్రోమోర్‌కు 13 టన్నులు, మండలంలోని గోళ్లపల్లెలో వున్న పుడమి ఫర్టిలైజర్స్‌కు 13 టన్నుల యూరియా దిగుమతి అయింది. విషయం తెలుసుకున్న రైతులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకుని తోపులాటకు దిగారు. దీంతో వ్యవసాయాధికారి చంద్రశేఖర్ ఇచ్చిన సమాచారం మేరకు బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి, సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులను అదుపు చేశారు. పోలీసుల పహారా మధ్య జరిగిన పంపిణీలో 290 బస్తాలు కేవలం గంటలో అమ్ముడు పోయాయి. ముందుగా వచ్చిన రైతులకు దొరకగా మిగిలిన రైతులు రిక్తహస్తాలతో వెనుదిరిగారు. యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నామని స్థానికంగా కొందరు అక్రమ నిల్వలు ఉంచుకుని అధిక ధరకు విక్రయిస్తున్నారని రైతులు వాపోయారు. ఈ విషయమై ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ యూరియా దొరకదేమోనన్న ఆతృతతో ప్రస్తుతం అవసరం లేకున్నా ముందస్తు కొనుగోలుకు రైతులు వస్తుండడంతో ఇబ్బందిగా ఉందన్నారు. యూరియాను అందరికీ అందుబాటులోకి తెస్తామన్నారు.

## బైక్ గుంతలో పడి ఇరువురికి గాయాలు


ప్రమాదానికి కారణమైన గుంత, గాయపడిన రమణయ్య, నరసింహులు

గాలివీడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఉన్న గోతిలో స్కూటీ పడడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నంబులపూలకుంట మండలం తిమ్మమ్మ మర్రిమానుకు చెందిన రమణయ్య, నరసింహులు శుభలేఖలు పంచేందుకు బైక్‌పై గాలివీడుకు వచ్చారు. అక్కడి నుంచి రాయచోటికి వెళుతుండగా ఒడిసెలవంకపల్లెకు సమీపంలోని గాలివీడు- రాయచోటి రహదారి మధ్యలో ఉన్న గుంతలో స్కూటీ పడడంతో రమణయ్య, నరసింహులు ఎగిరి రోడ్డుపైన పడ్డారు. నరసింహులుకు హెల్మెట్ ఉండడంతో స్వల్పగాయాలతో బయటపడగా వెనుకవైపు కూర్చున్న రమణయ్య తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 వాహనంలో ఇరువురిని రాయచోటి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

## ఆలస్యంగా నడిచిన ఏడుకొండలు రైలు



ములకలచెరువు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే ఏడు కొండలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం తీవ్ర ఆలస్యంగా నడిచింది. ఐదన్నర గంటలకుపైగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులకు చుక్కలు కన్పించాయి. సాంకేతిక కారణాలతో రైలు సికింద్రాబాద్ జంక్షన్‌లోనే ఆలస్యంగా బయలుదేరింది. ఈ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 8.14 గంటలకు వచ్చింది. అలాగే మదనపల్లెరోడ్‌కు తెల్లవారుజాము 3.18 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 8.39 గంటలకు, కలికిరికి తెల్లవారుజామున 3.49 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.09 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.23 గంటలకు వెళ్లింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు వెళ్ళాల్సిన రైలు ఉదయం 10.53 గంటలకు చేరింది. రైలు తీవ్ర ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు పడ్డ ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. రైలులో ప్రయాణించేందుకు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు రైల్వేస్టేషన్లలో గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం


ములకలచెరువు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారిణి తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కడప జిల్లా పులివెందులకు చెందిన చిన్నప్ప (32) రెండు వివాహాలు చేసుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మండలంలోని పెద్దపాళ్యంలో నివాసమున్న మొదటి భార్య దగ్గరకు వచ్చాడు. భార్యాభర్తలు ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన చిన్నప్ప క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు 108లో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## 27 మంది జూదరుల అరెస్ట్

రామాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దమల్ల పంచాయతీ చింతలవాండ్లపల్లె పరిధిలో బుధవారం ఏడుగురు జూదరులను అరెస్టు చేసి, రూ.27,500 నగదు, 3 బైకులు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజలు కూడా ఇటువంటి కార్యకలాపాలను గమనిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

# పసుపులో అంతరపంటగా బొప్పాయి

పసుపులో అంతరపంటగా సాగు చేసిన బొప్పాయి





● డ్రిప్‌తో కళకళలాడుతున్న తోటలు

దువ్వూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పసుపు సాగులో రైతులు కొత్తపద్ధతులు అవలంబిస్తున్నారు. పసుపుతో పాటు అంతర పంటగా బొప్పాయి సాగు చేపడుతు న్నారు. డ్రిప్ ఏర్పాటు చేసి నీటి తడులు అందించ డంతో తోటలు ఏపుగా పెరిగి కళకళలాడుతున్నాయి. మైదుకూరు ప్రాంతం పసుపు సాగుకు పెట్టింది పేరు. ఇక్కడ పండిన పసుపు పంట నాణ్యత పరంగా వ్యాపారులను ఆకర్షిస్తోంది. దువ్వూరు, ఖాజీపేట, మైదుకూరు, చాపాడు మండలాల్లో విస్తృతంగా ఈ పంటను సాగుచేశారు. పంట సాగుకు ఖర్చులు పెరిగిన నేపధ్యంలో సైతం పంట వేసేందుకు రైతులు వెనుకాడటం లేదు. మార్కెట్‌లో వట్టి పసుపునకు డిమాండ్ ఉండడం, మంచి ధరలు పలకడంతో రైతులు ఈ సంవత్సరం కూడా పసుపు సాగుకు ఎక్కువ ఆసక్తి కనపరిచారు. దువ్వూరు మండలంలో కిందటి సంవత్సరం 582 ఎకరాల్లో సాగైనట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. ఈ సంవత్సరం అదనంగా మరో వంద ఎకరాల్లో విస్తీర్ణం పెరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇక ఈ ఏడాది రైతులు పసుపులో అంతర పంటగా బొప్పాయిని సాగు చేశారు. తద్వారా తెగుళ్ల నివారణకు ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఇక పసుపు పంటలో డ్రిప్ విధానం అవలంబించేందుకు రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. తద్వారా తోటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వచ్చేందుకు తోడ్పడుతుందని అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుతం డ్రిప్ ఏర్పాటు చేసిన తోటలు కళకళలాడుతున్నాయి.

**డ్రిప్‌తో బహుళ ప్రయోజనాలు**

పసుపు సాగులో డ్రిప్ ఏర్పాటు చేయడం వలన ప్రయోజనాలు మెండుగా ఉన్నాయి. నేరుగా మొక్కకు నీరు అందుతుంది. నీటి వృధాను అరికట్టవచ్చు. ఎరువులను మొక్కకు అందేటట్లు చేయవచ్చు. కలుపు తగ్గుతుంది. ఖర్చులు ఆదా అవుతాయి. దిగుబడి పెరిగి రైతుకు లాభసాటిగా ఉంటుంది.

- రామకృష్ణ, ఉద్యానవన శాఖ అధికారి, మైదుకూరు

## పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



గుడిపాడులో రైతులతో మాట్లాడుతున్న జేడీఏ చంద్రానాయక్

దువ్వూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడుకోవడం వలన రైతులకు ప్రయోజనం ఉంటుందని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ తెలిపారు. గుడిపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి జొన్నపంటలను పరిశీలించారు. ఎరువులను మోతాదుకు మించి వాడవద్దని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులవాడక విధానం అవలంబించాలని తెలిపారు. ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ పోరెడ్డి వెంకటరమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్‌గా వెంకట సుధాకర్‌రెడ్డి ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న వెంకటసుధాకర్‌రెడ్డి

చాపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గవర్నర్‌పేటలోని రైతు శిక్షణ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల సంస్థ డైరెక్టర్‌గా పల్లవోలు వెంకటసుధాకర్‌రెడ్డి బుధవారం అట్టహాసంగా ప్రమాణస్వీకారం చేశారు. ఏపీఎస్ఐడీసీ ఎండీ తిరుమలరావు ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వెంకటసుధాకర్ రెడ్డి మాట్లాడుతూ డైరెక్టర్‌గా తనను నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, రాష్ట్రమంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, వేలూరు ఎంపీ పుట్టా మహేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యుల సహకారంతో రైతుల కోసం కొత్త స్కీంలను ఏర్పాటు చేస్తామన్నారు. దెబ్బతిన్న స్కీంలకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఐడీసీ బోర్డు చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ తదితరులు ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అక్టోబరు 31 వరకు గడువు పొడిగింపు

సీకేదిన్నె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో కాలేజీ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ ప్రవేశాలకు దరఖాస్తుల గడువును అక్టోబరు 31 వరకు పొడిగించినట్లు కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల ప్రవేశానికి ఎంసెట్ ర్యాంకుతో అవసరం లేదని, ఇంటర్ ఎంపీసీ లేదా బైపీసీ, రెండు సంవత్సరాలు పాలిటెక్నిక్ డిప్లమో హోంసైన్స్ కానీ, సీడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్, హార్టికల్చరల్, వెటర్నరీ, అగ్రికల్చలర్ ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్, పాలిటెక్నిక్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు లభిస్తాయన్నారు. గుంటూరులో హాస్టల్ వసతితో కూడిన బోధన, శిక్షణ ఉంటుందని.. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## 27న బ్యాడ్మింటన్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27న శనివారం ఉదయం 9గంటలకు స్కూలు గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 బ్యాడ్మింటన్ (షటిల్) ఎంపికలు జరగనున్నట్లు జిల్లా సెక్రటరీ సీఎం రాజు తెలిపారు. జిల్లాలోని ఔత్సాహిక క్రీడాకారులు తమ బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్ తప్పక వెంట తీసుకురావాలని కోరారు.

## మహిళల హక్కుల కోసం.. ముప్పై ఏళ్లుగా పోరాటం

● కరువుకు బలి అవుతున్నది సీమ ఆడబిడ్డలే ● చైతన్య మహిళా సంఘం కన్వీనర్ జ్యోతక్క





చైతన్య మహిళా సంఘం ర్యాలీలో పాల్గొన్న రెండు తెలుగురాష్ట్రాల మహిళా నేతలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో మహిళల హక్కుల కోసం మూడు దశాబ్దాలుగా ఎన్నో రాజ్య నిర్బంధాలను ఎదుర్కొంటూ అలుపెరుగక పోరాడుతున్న సంస్థ చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) అని ఆ సంఘం తెలుగు రాష్ట్రాల కన్వీనర్ జ్యోతక్క పేర్కొన్నారు. బుధవారం చైతన్య మహిళా సంఘం ఆవిర్భవించి మూడు వసంతాలు పూర్తయిన సందర్భంగా స్థానిక రామేశ్వరం రోడ్డులోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో రాష్ట్ర మహిళా సదస్సు జరిగింది. ఈ సదస్సులో జ్యోతక్క మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అనేక మహిళా సంఘాలు సమాఖ్యగా ఏర్పడి చైతన్య మహిళా సంఘంగా 1995లో తిరుపతిలో ఆవిర్భవించిందన్నారు. దీనికి దూబగుంట మహిళల సారా ఉద్యమ స్ఫూర్తే కారణమన్నారు. వరకట్న హత్యలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు సాగించి ఎందరో మహిళలకు అండగా నిలిచిందన్నారు. రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలతో కలిసి పనిచేసిందన్నారు. సభకు అతిథిగా పాల్గొన్నా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాలు మహిళలను అణిచివేసే సాధనాలన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న వారిలో కూడా ఈ మూఢనమ్మకాలు అంధవిశ్వాసాలు వుంటున్నాయన్నారు. భారత దేశం ప్రపంచంతో పాటి ఎదగకపోవడానికి ఇవే ప్రధాన కారణమన్నారు. డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ గీత మాట్లాడుతూ భ్రూణహత్యల వల్ల స్త్రీ పురుషుల రేషియో తగ్గి వివాహాలు కాని పరిస్థితి ఏర్పడుతుందన్నారు.. ఎన్జీవో మహిళా చైర్‌పర్సన్ జయమ్మ మాట్లాడుతూ ఉద్యోగ రంగంలో మహిళలకు అన్యాయాలు జరుగుతున్నాయన్నారు. ఏపీ రాష్ట్రకన్వీనర్ రాధ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలకు పర్మిట్ రూములిచ్చి, బార్లను అర్ధరాత్రి వరకు తెరిచి ప్రభుత్వాలు ఖజానాలు నింపుకుంటూ మహిళలకు సంక్షేమాన్ని అమలు చేస్తున్నామనడం ఎంతవరకు సమంజసమన్నారు. విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ సెక్స్ ట్రాఫికింగ్‌లకు హాట్‌స్పాట్‌లుగా రాయలసీమ కరువు ప్రాంతాలు వున్నాయన్నారు. ఏ పార్టీ అయినా సీమలో కరువు నిర్మూలన కోసం పాటుపడటం లేదన్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నేతల సందేశాలు మహిళల హక్కుల పోరాటంలో తమ సంఘీభావం ప్రకటించాయి. కార్యక్రమంలో సీఎంఎస్ జిల్లా కన్వీనర్ పద్మ, ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా కన్వీనర్ సురేష్‌బాబు, ఎస్‌టీయూ రాష్ట్ర నాయకుడు రషీద్, మహిళాశక్తి రాష్ట్ర కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, యువ న్యాయవాది హరిత, రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ మహమూద్, దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ, పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, జమాతే ఇస్లాం మహిళా కన్వీనర్ రెహనా, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సభలో ప్రజాకళామండలి కళాకారుల పాటలు సభికులను ఉత్తేజపరిచాయి.



మాట్లాడుతున్న జ్యోతక్క

## బోధనలో కృత్రిమ మేథ వినియోగం అవసరం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేథ (ఏఐ)ను బోధన, పరిశోధనలో వినియోగిస్తే విద్యార్థుల్లో ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెరుగుతుందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పీఎం ఉష విభాగం ఆధ్వర్యంలో క్రియాశీల బోధన కోసం ఏఐ సాధనాలు అనే అంశంపై జాతీయస్థాయి ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ విద్యార్థులు, అధ్యాపకుల జ్ఞానాన్ని విస్తరించడంలో తోడ్పడుతుందని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఎస్వీయూ ప్రొఫెసర్ డాక్టర్ జీవీ రమేష్‌బాబు ఏఐ ప్రాధాన్యతను వివరించారు. పీఎం ఉష ప్రాజెక్టు కింద యూనివర్సిటీకి రూ.20కోట్లు మంజూరైనట్లు సమన్వయకర్త డాక్టర్ టి.చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్.సునీత, డాక్టర్ కె.లలిత, డాక్టర్ పి.సరితలు సమన్వయం చేశారు.



## కారు ఢీకొని బాలిక మృతి



చాపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగురవలూరు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం గొల్లపల్లె దక్షిణి (6) అనే బాలికను కారు ఢీకొనడంతో మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు... బి.మఠం మండలం నందిపల్లె గ్రామానికి చెందిన గొల్లపల్లి రాజు చిన్నగురవలూరులోని ఓ వివాహ కార్యక్రమానికి తన కూతురుతో కలిసి హాజరయ్యారు. పెళ్లి కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఇంటికి వెళుతుండగా వాహనాలు నిలిపిన చోట ఒక కారు రివర్స్ తిప్పుతుండగా దాని వెనుక ఉన్న బాలిక ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. తలకు, ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో చికిత్స కోసం ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వివాహిత ఆత్మహత్య



కడప క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సాయిపేట ఆటో స్టాండు ఏరియాకు చెందిన వివాహిత గురువారం తెల్లవారు జామున ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. సాయిపేటకు చెందిన పఠాన్ నసీంఖాన్ (42) ఆమె భర్త ఆరిఫుల్లాఖాన్ మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం ఆరిఫుల్లాఖాన్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. ఈ నేపధ్యంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నసీంఖాన్ ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు.

## గాయపడ్డ టీడీపీ కార్యకర్తమృతి



నాగేంద్ర (ఫైల్)

కలసపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులతో కలిసి పెళ్లిచూపులకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టీడీపీ కార్యకర్త ఎల్లనూరు నాగేంద్ర (30) చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కలసపాడు మండలం లింగారెడ్డిపల్లె నుంచి గిద్దలూరుకు సోమవారం తల్లిదండ్రులతో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సంజీవరాయునిపేట వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా నాగేంద్ర మృతి చెందాడు. తల్లిదండ్రులు అక్కడే చికిత్స పొందుతున్నారు. నాగేంద్ర మరణవార్త తెలిసిన రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా రహంతుల్లా, నీటి సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి, యువ నాయకుడు స్వామిరంగారెడ్డి, మాజీ సైనికుడు మస్తాన్, గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## భిన్నత్వంలో ఏకత్వమే యూఎస్‌వో లక్ష్యం

● రేపటి నుంచి పులివెందులలో జాతీయస్థాయి స్కూల్స్ ఫెస్టివల్ ● యూఎస్‌వో సెక్రటరీ నీనా జైన్



సమావేశంలో మాట్లాడుతున్న నీనా జైన్

పులివెందుల రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలోని వివిధ సంస్కృతులు, సాంప్రదాయలు కలిగిన విద్యార్థులను ఒక్కచోటకు చేర్చి భిన్నత్వంలో ఏకత్వం చేయాలన్నదే యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (యుఎస్ఓ) లక్ష్యమని ఆ సంస్థ సెక్రటరీ నీనా జైన్ స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ ఇస్టా కార్యాలయంలో సంస్థ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ భానుప్రకాష్, ట్రెజరర్ విజయ్‌కుమార్ నెహ్రూతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ సంస్థ 75 ఏళ్లుగా 31 వేల పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తోందన్నారు. ఈసారి పులివెందులలో జాతీయస్థాయి స్కూల్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో 9 రాష్ట్రాలకు చెందిన 17 సంవత్సరాల లోపు పిల్లలు 150 మంది పాల్గొంటారన్నారు. ఆయా రాష్ట్రాలలోని సంస్కృతి, సంప్రదాయాలు, వేషధారణలు ప్రదర్శించనున్నారన్నారు. అలాగే వీరికి వకృత్వ, క్విజ్, జనరల్ నాలెడ్జ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇక విహారయాత్రలో భాగంగా గండికోట, యూసీఐఎల్‌ను సందర్శించడం జరుగుతున్నారు. పిల్లల్లోని దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏర్పాటుచేస్తున్న ఈ ఫెస్టివల్‌ను జయప్రదం చేసేందుకు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యలను ప్రస్తావించాలి

● జగన్‌కు తులసిరెడ్డి సూచన

వేంపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లి రాష్ట్రంలో ప్రజల సమస్యలను ప్రస్తా వించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. ప్రతిపక్ష హోదా కావాలని మంకు పట్టుపట్టడం హాస్యాస్పదమని, అసెంబ్లీకి వెళ్లని పక్షంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వేంపల్లెలో బుధవారం విలేకరుల సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడుతూ 11 సీట్లు వచ్చిన వైసీపీకి ప్రతిపక్ష హోదా రాదని తెలిసి కూడా ఉద్దేశపూర్వకంగా జగన్ అసెంబ్లీకి వెళ్లకపోవడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే అన్నారు. గతంలో కాంగ్రెస్‌కు కూడా ప్రతి పక్ష హోదా ఇవ్వలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తాత్సారం చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు జగన్ అసెంబ్లీకి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

## పేదలకు జీఎస్టీ మినహాయించాలి

ప్రొద్దుటూరుటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినా కొన్ని వస్తువులకే తగ్గింపు ధరలు అమలు అవుతున్నాయని, అందువలన రేషన్‌కార్డు ఉన్న పేదలకు జీఎస్టీ మినహాయించాలని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో వివిధ కార్పొరేషన్లకు బడ్జెట్ కేటాయించకపోవడం వలన వెనుకబడిన అణగారిన వర్గాల ప్రజలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొరేషన్లకు తగిన బడ్జెట్ కేటాయించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ పథకానికి దళిత, గిరిజన మహిళలు భూమి కొనుగోలు పథకాన్ని అనుసంధానం చేసి, యూనిట్ ధరను ఎకరాకు 20 నుండి రూ.50 లక్షలకు పెంచాలన్నారు. ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు డానియేల్ మాదిగ, బాలలక్షుమయ్య మాదిగ, కర్ణమాదిగ, నాగభూషణం మాదిగ పాల్గొన్నారు.

## పిల్లల విద్య ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ వహించాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్



అధికారులతో చర్చిస్తున్న జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాలలోని పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగు శ్రద్ధ వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని విజిట్ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను, వంట గదులను, భోజన సదుపాయాన్ని, రికార్డులను పరిశీలించారు.

అనంతరం జడ్జి మాట్లాడుతూ విద్య విలువైనదని, క్రమశిక్షణతో అభ్యసించి గురువులకు, సమాజానికి మంచి పేరు తేవాలన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024పై వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ 14456 మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో నిర్వహించిన జిల్లా అధికారుల మానిటరింగ్ సమావేశంలో హిట్ అండ్ రన్ కేసులలో పరిహారం, చెల్లింపు మొదలగు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కడప, రాజంపేట డివిజన్ ఆడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారులు, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## 'పి-4'వేగవంతం చేయాలి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : పంచాయతి కార్యదర్శులు సచివాలయ సిబ్బంది కలిసి పి-4 కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో సుజాతమ్మ సూచించారు. బుధవారం స్థానిక మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బయోమెట్రిక్, ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలన్నారు.








ఒంటిమిట్ట: అన్నపూర్ణగా కన్యకాపరమేశ్వరి


చిట్వేలి: అన్నపూర్ణేశ్వరిగా భద్రకాళి అమ్మవారు


నందలూరు: గజలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి


రాయచోటి: గాయత్రిగా దాక్షాయణి అమ్మవారు


రాయచోటి:భవానీ అలంకరణలో ఉమాదేవి

# అన్నపూర్ణే.. సదాపూర్ణే.. శంకర ప్రాణ వల్లభే..

**అన్నపూర్ణే.. సదా పూర్ణే.. శంకర ప్రాణ వల్లభే.. జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం.. భిక్షాందేహి.. పార్వతీ.. అని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు.**

రాజంపేట టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, చౌడేశ్వరి, సాదు కామాక్షమ్మ ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణగా, ఉదయగిరి యల్లమ్మ ఆలయంలో చంద్రఘంట అలంకరణ, వెంకటరాజంపేటలో కనకదుర్గగా, మహేశ్వర ఆలయంలో గాయత్రి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.
**రైల్వేకోడూరు:** పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గునిశెట్టి రమేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.
**ఒంటిమిట్ట :** పట్టణంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్‌బాబు, కిరణ్‌కుమార్, తుమ్మలపెంట శ్రీనివాసు లు, హరికృష్ణ, రెంటాల లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట: అన్నపూర్ణ అలంకారంలో చౌడేశ్వరి


రైల్వే కోడూరులో అన్నపూర్ణ అలంకారంలో వాసవి

**చిట్వేలి:** పాత చిట్వేలిలోని భద్రకాళి సమేత వీరభద్ర ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చిట్వేలి శివాలయం, వరదరాజులస్వామి, అమ్మవారిశాల, మారెమ్మ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో మూడో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.
**నందలూరు:** నాగిరెడ్డిపల్లెలో వాసవి కన్యకాపరమేశ్వరి గజలక్ష్మి అలంకారంలోదర్శనమిచ్చారు. ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహశ్రేష్ఠి, సెక్రటరీ గెలివి నాగసురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహప్రసాద్, మంచికంటి నారాయణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. నాలుగో రోజు గురువారం వాసవీ కన్యకాపరమేశ్వరి కృష్ణమూర్తి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.
**రాయచోటిటౌన్ :** పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపేటలో దుర్గా మాతకు మహిళలు కుంకుమార్చన చేశారు. కొత్తపేట రామాపురంలో చౌడేశ్వరి పార్వతీదేవి అలంకరణలో, పాతరాయచోటిలోని అగస్త్యేశ్వరాలయంలో దాక్షాయణి పార్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.
**చిన్నమండెం:** దేవగుడిపల్లి లడ్డుస్వామి, కాళికాలయంలో ఉదయం అమ్మవారిని అలంక రించి పూజలు చేశారు. సాయంత్రం అన్నదానం చేశారు
**రాయచోటినేతాజీ సర్కిల్:** ఎస్ఎన్‌కాలనీ చెక్‌పోస్టు సమీపంలోని ఉమామహేశ్వరాలయంలో ఉమాదేవి భవానీ అలంకరణలో భక్త లకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు శివగంగిరెడ్డి భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఎరుకలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): ఎరుకుల కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి అమావాస్య రమణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని సమితి జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. ఎరుకుల కులస్తులు గతంలో బిడారి ప్రాంతాల్లో నివసిస్తూ కులవృత్తిపై ఆధారపడి జీవించే వారన్నారు. రాను రాను పరిస్థితులు మారడంతో ఉపాధి కరువై పట్టణాలకు చేరి వెనుకబాటుతనానికి గురవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపి ఎరుకలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు, ఐటీడీఏ స్థాపించి మైదాన ప్రాంత గిరిజనుల ఎదుగుదలకు తోడ్పాటును అందించాలని కోరారు. చట్ట సభల్లో ఎరుకలకు ప్రాతినిధ్యం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి అమా వాస్య రెడ్డెయ్య, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

## పీ-4 వేగవంతం చేయాలి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పీ-4 (బంగారు కుటుంబం) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డివిజన్ డీఎల్‌డీవో పీ. నరసింహామూర్తి సూచించారు. బుధవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో సచివాలయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిని గుర్తించాలన్నారు. నివేదికల్లో తప్పుగా లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో ఆర్. నాగిరెడ్డి, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడండి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : బాలిరెడ్డిపల్లె వై.కోట పంచాయతీ పరిధిలోని వందల ఎకరాలప్రభుత్వ భూ ములు ఆక్రమణకు గురవుతున్నాయని బీకే ఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి వాపోయారు. మండల కార్యదర్శి మల్లిక వెంకటరమణ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో కలిసి బుధవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. ఎం.జయరామయ్య కటారి గోపాల్, సుబ్బరాఘవులు గిరిజనులు పాల్గొన్నారు.



## మహిళా పోలీసుల సమస్యలు పరిష్కరించండి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కడపజిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి మహిళా పోలీసుల సమస్యలను తెలియజేసినట్లు జిల్లా సచివాలయ జేఏసీ నాయకుడు మస్తాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, .జేఏసీ కమిటీ సభ్యులు లక్ష్మణ్, విజయ్, చిన్న, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## హత్యరాల ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

రాజంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని హత్యరాలల త్రేతేశ్వరస్వామి ఆలయ పాలక మండలి సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన్, చైర్‌పర్సన్‌గా పూల నాగమణి, ఎక్స్ అఫిషియో సభ్యులు పద్మనాభశాస్త్రి, సభ్యులు కె.రమాదేవి, ఎస్.వెంకటేశ్వర్లు నాయడు, పి.భారతి, కె.నరసింహ లు, ఎం.చిన్నయ్య, జనసేన నాయకుడు కె.రమేష్‌బీజేపీ నాయకుడు వై.వేణుమాధవ్‌వర్మతో ప్రమాణస్వీకారం చేయించారు. పూల నరసింహులు, కోవూరు సుబ్రమణ్యంనాయుడు, పి.బాలాజీ, పి.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ధ్వజ స్తంభ సంప్రోక్షణ

ఒంటిమిట్ట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండ రామాలయంలో బుధవారం ఉదయం ధ్వజస్తంభ సంప్రోక్షణ కార్యక్రమం వైభవంగా ముగిసింది. మంగళవారం సాయంత్రం సంప్రోక్షణ కార్యక్రమానికి అర్చకులు అంకురార్పణ చేశారు. బుధవారం తెల్లవారుజామునే ధ్వజస్తంభ సంప్రోక్షణ కార్యక్రమాన్ని వేద మంత్రోచ్చరణల మధ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు వీణా రాఘవాచార్యులు, శ్రావణ కుమార్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్ ధ్వజస్త ంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు హనుమంతయ్య, నవీన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కర్కటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లు విడుదల

చిట్వేలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గుండాలకోన కర్కటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆలయ కమిటీ చైర్మన్ రాజశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండాలకోన ర్కటేశ్వరస్వామి దేవస్థానంలో 12 శివలింగాలకు భక్తులతో సామూహిక అభిషేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు. నవంబరు 27 నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలు ఐదు వారాల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరుద్ర నక్షత్రం ఉన్న రోజు, కార్తీక పౌర్ణమినాడు, మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకంలో పాల్గొనదలచినవారు రూ.5116 నగదు చెల్లించి కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు. ప్రతి సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7710203050 నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శివారెడ్డి, సెక్రటరి ప్రహల్లాద, ట్రెజరర్ రామచంద్రయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బారావుకు 'డాక్టర్ సర్వేపల్లి' అవార్డు

రాజంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బోధన, పరిశోధన, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాల్లో కృషి చేసిన డాక్టర్ సుబ్బారావ ు సర్వేపల్లె రాధాకృష్ణన్ అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారని అన్నమాచార్య యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఈ సాయిబాబారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు. బుధవారం వారు సుబ్బారావును అభినందించారు.

## ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంమోహన్‌రెడ్డి సూచించారు. జాతీయ సేవా పథక దినోత్సవం సందర్భంగా కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు

## పని గంటల పెంపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పని గంటలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదని, వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పాత బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు.



రాజంపేట: నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

**రైల్వేకోడూరు:** కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసిన పది గంటలు పని విధానాన్ని రద్దు చేసి ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షులు మాదరాజు గంగాధర్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు రెవెన్యూశాఖ కార్యాయలం వద్ద ఆశా కార్యకర్తలతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఆశా వర్కరు రత్నమ్మ, నాయకురాళ్లు ధనలక్ష్మి, చంద్రకళ, కుమారి, నాగరత్న పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం ఆపాలని వినతి

సుండుపల్లె, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మసీదు నిర్మిస్తున్నారని అక్కంపల్లివాసులు బుధవారం తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రానికి సమీపంలోని అక్కంపల్లి లేఅవుట్‌లో పేదల ఇంటి నిర్మాణం కోసం ఇచ్చిన స్థలంలో అనుమతులు లేకుండా మసీదు నిర్మిస్తున్నారని, ఈ విషయాన్ని గతంలో కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లగా, సబ్ కలెక్టర్ పరిశీలించి పనులను నిలిపివేశారని వారు వివరించారు. ప్రస్తుతం అధికారులు మారడంతో తిరిగి నిర్మాణం ప్రారంభించారని, రాత్రికి రాత్రి మౌల్డింగ్ వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రమణయ్య, శ్రీను, సుబ్బరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## పేద కుటుంబాలను గుర్తించాలి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలను గుర్తించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో పీ4 కార్యక్రమంపై సచివాలయ, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఉషారాణి, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.
**రామాపురం:** స్థానిక మండల పరిషత్ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పీ4పై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో జాషువా తెలిపారు. ఏఎస్‌వో నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్య మని ఐసీడీఎస్ సీడీపీవో జహరాబీ తెలిపారు. బుధ వారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సుపోషిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా లక్కిరెడ్డిపల్లె సెంటర్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. ప్రతి అంగన్వాడీ టీచర్ తన పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యత ను తెలియజేశారు. పౌష్టికాహారంతో పాటు కూరగాయలను కూడా బాగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దాద్వి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## మన డబ్బులు - మన లెక్కలు యాప్‌పై అవగాహన

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మన డబ్బులు - మన లెక్కలు యాప్‌పై ఏపీఎం మల్లికా ర్జునరాజు డ్వాక్రా మహిళలకు బుధవారం అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఎండీ ఎంఎల్ యాప్ డౌన్ లోడ్ చేయించడం, సభ్యురాలు వారీగా పొదుపు, అప్పులు తదితర లావాదేవీ లన్నీ యాప్‌లో నమోదు చేయడం, సంఘం పుస్తకాలు రాయించడంలో అవగాహన కల్పించారు. అనంతరం సభ్యులతో కలిసి వీధుల్లో ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో సీసీలు దామోదర్, హరిబాబు, వీవోఏస్, ఎంఎస్‌వోబీలు, ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు

నందలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు రాజంపేట డివిజన్ పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ విజయభాస్కర్ తెలిపారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లె, నల్లతిమ్మాయపల్లె పంచాయతీల్లోని పలు గ్రామాల్లో టీకాలు వేశారు. పాటూరు, నందలూరు పశువైద్యులు డాక్టర్ ఈశ్వరప్రసాద్, డాక్టర్ వైమాధవీలత, జేవీవోలు సుగుణ, గంగులయ్య, వీఏ సుదర్శన్‌రెడ్డి, ఏహెచ్‌ఏలు సుస్మిత, శ్రీనాథరెడ్డి, ప్రసాద్, జాహ్నవి, శిరీష పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం

నందలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో బుధ వారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థా పక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సి పాల్ శ్రీదేవి మాట్లాడుతూ జాతీ య సేవా పథకం లక్ష్యాలు అందరికి తెలియాలనే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ పి.నీలవేణి మాట్లాడుతూ ప్రత్యేక శిబిరం మూడో రోజు విద్యార్థులు వ్యక్తిగత శ్రేయస్సు కంటే సామాజిక శ్రేయస్సు గొప్పది అన్న విషయం అవగాహన చేసుకో వాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీలో పాల్గొన్నారు.

## సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ

రాయచోటిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీలో సిమెంటు రోడ్ల ఏర్పాటు చేస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురం మంగళ కాలనీలో సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో సిమెంటు రోడ్ల నిర్మాణం ద్వారా ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. మంగళకాలనీలో చేపడుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన మున్సిపల్ అధికా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంగా ఈశ్వ రయ్య, బొమ్మల రత్నం, శివ, శివశంకర్, చెంగా శ్రీనివాసులు, చెంగా జయ శంకర్, భోజనపు బలరాం, రామచంద్ర, టేకూరి ఈశ్వరయ్య, ఫయాజ్, సుప్రజ తదితర టీడీపీ నాయకులు, మున్సిపల్ డీఈ విజయ్‌కుమార్, ఏఈ కిరీటి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

## అంగన్వాడీల్లో మెరుగైన సేవలు అందించాలి

సుండుపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల ద్వారా మెరుగైన సేవలు అందించాలని సీడీపీవో రాజ మ్మ తెలిపారు. బుధవారం మండల పాఠశాలలో మండల స్థాయి అంగన్వాడీ కార్య కర్తల సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలో చిన్నారులకు ఆటపాటలతో కూడి విద్యను అందించాలన్నారు. చిన్నారులు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఇది ప్రతి ఒక్క అంగన్వాడీ కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తులసమ్మ, విజయలక్ష్మి, సుశీల, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగమ్మకు పూజలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలిజ వీధిలో వెలసిన గంగమ్మకు టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి బుధవారం పూజలు నిర్వహించా రు. అన్నదాన కార్యక్రమంలో పా ల్గొని పేదలకు భోజనం వడ్డిం చారు. అనంతరం బలిజవీధి లోని కోదండరామాలయం వద్ద అమ్మ వారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పల్లా శ్రీనివాసరావును కలిసిన టీడీపీ నాయకులు

సుండుపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జగన్‌మోహన్ రాజుతో కలసి బుధవారం విజయవాడలో ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసినట్లు సుండుపల్లె మండల టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ముఖ్యంగా సుండుపల్లె- రాయచోటి డబుల్ రోడ్డు, ఝరికోన నుంచి కాలువల ఏర్పాటు తదితర సమస్యలపై వినతి పత్రం అందజేశామన్నారు. కురవ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మంగిరి సురేశ్ కుమార్, టీడీపీ నాయకులు హరికుమార్‌నాయుడు, తెలుగు యువత నాయకుడు మాలేపాటి సురేశ్‌నాయుడు పాల్గొన్నారు.


పల్లా శ్రీనివాసరావుతో చమర్తి, శివరాంనాయుడు

## 28 నుంచి గంగమ్మ తిరునాళ్లు

సుండుపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28వ తేదీ నుంచి పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బూడిదేటిపల్లె సమీపంలో గంగమ్మ తిరునాళ నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ తెలిపారు. 28న అమ్మవారి పూజ, 29న గ్రామోత్సవం, 30న చాందినీ బండ్ల కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

# ఆవుల పెంపు రాబడి

**ఆవుల పెంపకంతో ఆదాయం ● పల్లెల్లో పొంగుతున్న పాలధార**


రైతు డెయిరీలో ఉన్న పలురకాల జాతుల ఆవులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆవుల పెంపకం బాగా పెరుగుతోంది. ఆవుపాలు శ్రేష్ఠంగా భావించడంతో వీటికి రోజు రోజుకు డిమాండ్ పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల పాడి రైతులు రకరకాల ఆవులను తీసుకుని వచ్చి పెంచుతున్నారు. తద్వారా వచ్చే పాలను పాలకేంద్రాలకు తరలించి ఆదాయం పొందుతున్నారు.

.రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కువగా ఉద్యాన పంటలపై ఆధారపడి ఉన్నారు. తరచూ నష్టాలు రావడం, చీడపీడలు ఎక్కువ కావడం, ప్రకృతి వైపరీత్యాలు తదితర కారణాలతో ఉద్యాన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో ఉద్యాన రైతులు చాలామంది పాడి రైతులుగా మారుతున్నారు. ఉన్న పొలంలోనే షెడ్లు వేసుకుని ఆవులను పెంచుకుంటూ ఆదాయం పొందుతున్నారు. ఆవులు, గేదెల పెంపకాన్ని కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆవులు, గేదెల పాలు సేకరించి కొందరు తిరుపతి, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాల్లోని పాల కేంద్రాలకు తరలిస్తున్నారు. ఒక్క లీటరు ఆవు పాలు రూ.25 నుంచి రూ.30కి అమ్ముతున్నారు. గేదె పాలను మాత్రం స్థానికంగానే అమ్ముతున్నారు. కొందరు వ్యాపారులు పాలను పాడి రైతుల నుంచి సేకరించుకుని రైల్వేకోడూరు పట్టణంలో అమ్ముతున్నారు. ఒక్క ఆవుకు రోజు సగటున గడ్డి, పోషకాలు రూ.100 ఖర్చు వస్తోందని పాడి రైతులు చెబుతున్నారు.

ఒంగోలు, పుంగనూరు, నాటు, గిర్, జల్లికట్టు, జెర్సీ తార్‌పాల్, శాషివాల రకం ఆవులతో పాటు, నాటు ఎనుములు, షాడో, కాంక్రేజ్ తదితర రకాల గేదెలను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుని పాడిని జీవనాధారంగా చేసుకుంటున్నారు. పశు సంవర్ధక శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. రైల్వేకోడూరు మండలంలోని పొట్టిరాజుగారిపల్లెలో పద్మ అనే మహిళ సుమారు 100కు పైగా వివిధ రకాల ఆవులు, గేదెల పెంపకం చేపట్టారు. రోజుకు దాదాపు 150లీటర్ల పాలు అమ్ముతున్నారు.

### రోజుకు 58,600 లీటర్ల పాలు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో చుక్క ఎనుములు, నాటు ఆవులు కలిపి 25,544 ఉన్నాయి. క్రాస్‌బ్రీడ్ ఆవులు, దేశీయ ఆవులు కలిపి 19,215 ఉన్నాయని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో సుమారు 6 వేల మంది పాడి రైతులు ఉన్నారు. ప్రతి రోజు ఆవులు, గేదెలు కలిపి 58,600 లీటర్ల పాల ఉత్పత్తి ఉంది. ఇందులో ఇంటి అవసరాలకు 11,000 వేల లీటర్లు, ప్రైవేటు డెయిరీలకు 23,000 లీటర్ల పాలను సరఫరా చేస్తున్నారు. మిగిలిన పాలను స్థానికంగానే అమ్ముతున్నారు.

### గోరక్షణతో సంతృప్తి



ఆదాయం కంటే గోరక్షణతో ఆత్మ సంతృప్తి ఉంటుంది. గేదెలు, జెర్సీ ఆవులు, నాటు ఆవులు 100కు పైగా ఉన్నాయి. వాటి సంరక్షణకు 30 మంది కూలీలను పెట్టుకున్నాం. గోవులను పెంచడం ద్వారా మా కుటుంబానికి మంచి జరుగుతోంది.

**- పద్మ, మహిళా పాడి రైతు, పొట్టిరాజుగారిపల్లె**


షాడో రకం ఆవు


జల్లికట్టు ఎద్దు

### పాలిచ్చే వాటిని ఎంపిక చేసుకోవాలి

ప్రస్తుతం పాడి రైతులు చుక్క ఎనుములు, నాటు ఆవులు, క్రాస్‌బీడ్ ఆవులు, దేశీయ జాతులకు చెందిన ఆవుల పెంపకాన్ని మొదలు పెట్టారు. పాలిచ్చే పశువులను పాడి రైతులు ఎంపిక చేసుకోవాలి. పాల దిగుబడి పెంచుకుంటే పాడి రైతులకు ఆదాయం ఉంటుంది.

**- ప్రతాప్, రైల్వేకోడూరు మండల పశువైద్యాధికారి**

## వజ్రాల వంకపై పైపుల ఏర్పాటు


వజ్రాల వంకపై పైపులు వేస్తున్న దృశ్యం

పీలేరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం ఎంపీ పల్లె పంచాయతీ చెరువుకిందపల్లె వద్ద ఉన్న వజ్రాల వంకపై సిమెంటు పైపుల ఏర్పాటు ప్రక్రియను అధికారులు చేపట్టారు. చెరువుకిందపల్లెకు రోడ్డు సౌకర్యం లేకపోవడం, ఉన్న మట్టి రోడ్డు కూడా ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన వైనాన్ని ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'దారిద్ర్యం' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. చెరువుకిందపల్లె దుస్థితిపై మండల స్థాయి అధికారులు స్పందించారు. రాయచోటి నుంచి సిమెంటు పైపులను తెప్పించి తెగిపోయిన వజ్రాల వంక కాజ్‌వేపై ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు గురువారం సాయంత్రానికి కొలిక్కి వచ్చి తమకు దారి సౌకర్యం కలుగుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## యూరియా కోసం ఎగబడ్డ రైతులు


బి.కొత్తకోటలో యూరియా కోసం క్యూలో రైతులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోటలోని గ్రోమోర్ కేంద్రంలో యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత ఉండటంతో వరి, మొక్కజొన్న సాగుచేసిన రైతులు యూరియా కోసం వేచి చూస్తున్నారు. బుధవారం బి.కొత్తకోటలోని గ్రోమోర్‌కు 13 టన్నులు, మండలంలోని గోళ్లపల్లెలో వున్న పుడమి ఫర్టిలైజర్స్‌కు 13 టన్నుల యూరియా దిగుమతి అయింది. విషయం తెలుసుకున్న రైతులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకుని తోపులాటకు దిగారు. దీంతో వ్యవసాయాధికారి చంద్రశేఖర్ ఇచ్చిన సమాచారం మేరకు బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి, సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులను అదుపు చేశారు. పోలీసుల పహారా మధ్య జరిగిన పంపిణీలో 290 బస్తాలు కేవలం గంటలో అమ్ముడుపోయాయి. ముందుగా వచ్చిన రైతులకు దొరకగా మిగిలిన రైతులు రిక్తహస్తాలతో వెనుదిరిగారు. యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నామని స్థానికంగా కొందరు అక్రమ నిల్వలు ఉంచుకుని అధిక ధరకు విక్రయిస్తున్నారని రైతులు వాపోయారు. ఈ విషయమై ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ యూరియా దొరకదేమోనన్న ఆతృతతో ప్రస్తుతం అవసరం లేకున్నా ముందస్తు కొనుగోలుకు రైతులు వస్తుండడంతో ఇబ్బందిగా ఉందన్నారు. యూరియాను అందరికీ అందుబాటులోకి తెస్తామన్నారు.

## బైక్ గుంతలో పడి ఇరువురికి గాయాలు


ప్రమాదానికి కారణమైన గుంత, గాయపడిన రమణయ్య, నరసింహులు

గాలివీడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఉన్న గోతిలో స్కూటీ పడడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నంబులపూలకుంట మండలం తిమ్మమ్మ మర్రిమానుకు చెందిన రమణయ్య, నరసింహులు శుభలేఖలు పంచేందుకు బైక్‌పై గాలివీడుకు వచ్చారు. అక్కడి నుంచి రాయచోటికి వెళుతుండగా ఒడిసెలవంకపల్లెకు సమీపంలోని గాలివీడు- రాయచోటి రహదారి మధ్యలో ఉన్న గుంతలో స్కూటీ పడడంతో రమణయ్య, నరసింహులు ఎగిరి రోడ్డుపైన పడ్డారు. నరసింహులుకు హెల్మెట్ ఉండడంతో స్వల్పగాయాలతో బయటపడగా వెనుకవైపు కూర్చున్న రమణయ్య తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 వాహనంలో ఇరువురిని రాయచోటి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

## ఆలస్యంగా నడిచిన ఏడుకొండలు రైలు



ములకలచెరువు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే ఏడు కొండలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం తీవ్ర ఆలస్యంగా నడిచింది. ఐదున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులకు చుక్కలు కన్పించాయి. సాంకేతిక కారణాలతో రైలు సికింద్రాబాద్ జంక్షన్‌లోనే ఆలస్యంగా బయలుదేరింది. ఈ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 8.14 గంటలకు వచ్చింది. అలాగే మదనపల్లెరోడ్‌కు తెల్లవారుజాము 3.18 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 8.39 గంటలకు, కలికిరికి తెల్లవారుజామున 3.49 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.09 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.23 గంటలకు వెళ్లింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు వెళ్ళాల్సిన రైలు ఉదయం 10.53 గంటలకు చేరింది. రైతు తీవ్ర ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు పడ్డ ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి. రైలులో ప్రయాణించేందుకు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు రైల్వేస్టేషన్లలో గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారిణి తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కడప జిల్లా పులివెందులకు చెందిన చిన్నప్ప (32) రెండు వివాహాలు చేసుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మండలంలోని పెద్దపాళ్యంలో నివాసమున్న మొదటి భార్య దగ్గరకు వచ్చాడు. భార్యాభర్తలు ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన చిన్నప్ప క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు 108లో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## 27 మంది జూదరుల అరెస్ట్

రామాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దమల్ల పంచాయతీ చింతలవాండ్లపల్లె పరిధిలో బుధవారం ఏడుగురు జూదరులను అరెస్టు చేసి, రూ.27,500 నగదు, 3 బైకులు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజలు కూడా ఇటువంటి కార్యకలాపాలను గమనిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

## రెడ్డెమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణం స్వీకారం చేస్తున్న చైర్మన్, పాలకవర్గ సభ్యులు

గుర్రంకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మ ఆలయ చైర్మన్‌గా లంకిపల్లె రాజన్ననాయుడు బుధవారం ప్రమాణం చేశారు. ఆలయ పాలకవర్గ సభ్యుల చేత దేవదాయశాఖ అధికారి శశికుమార్ ప్రమాణం చేయించారు. ఆలయ చైర్మన్‌గా రాజన్ననాయుడు, పాలకవర్గ సభ్యులుగా గాయత్రి, ఆశాజ్యోతి, అంజికుమార్, శ్రీనివాసుల నాయుడు, కిరణ్, యశోదమ్మ, పుణ్యవతి, ప్రభాకర్, గోవిందమ్మ, ప్రకాశ్ చేత ప్రమాణం చేయించారు. చైర్మన్ రాజన్ననాయుడు మాట్లాడుతూ రెడ్డెమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. అమ్మవారి కీర్తిని విస్తరింపజేయడానికి అన్నివిధాలా పనిచేస్తామన్నారు. ఆలయంలో భక్తులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవో మంజుల, నేతలు జగదీష్‌కుమార్, రెడ్డిప్రసాద్‌నాయుడు, దద్దాల హరిప్రసాద్ నాయుడు, ఎల్లుట్ల మురళీ, చలమారెడ్డి, టి.కృష్ణమ నాయుడు, బాబాజాన్, ప్రదీప్, జయసూరి, నాగేంద్ర, మహాత్మారెడ్డి, ఆనంద్, రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతి చెందిన లక్ష్మయ్య

లక్కిరెడ్డిపల్లె/సీకే దిన్నె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని దప్పేపల్లి పంచాయతీ డి.రామాపురానికి చెందిన ఈశ్వరయ్య, కొప్పుల లక్ష్మయ్య కడప నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తుండగా ఘాట్‌లోని 5వ మలుపు వద్ద వేగంగా వస్తున్న లారీలో నుంచి డ్రైవర్ కిందకు దూకడాన్ని గమనించి బైకును పక్కన పడేసి పరుగెడుతుండగా లారీ వారిపైకి దూసుకెళ్లింది. కొప్పుల లక్ష్మయ్య (65) అక్కడికక్కడే మృతి చెందగా ఈశ్వరయ్య గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. చింతకొమ్మదిన్నె పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు లక్ష్మయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మరణంతో దప్పేపల్లి గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన చింతకొమ్మదిన్నె సీఐ బాలమద్దిలేటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పొలం విషయంలో వృద్ధ దంపతులపై దాడి

**● అవమానంతో వృద్ధుడి ఆత్మహత్యాయత్నం**


చికిత్స పొందుతున్న రెడ్డెప్ప

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వృద్ధ దంపతులపై చేసిన దాడిని అవమానంగా భావించిన వృద్ధుడు కోలా రెడ్డెప్ప (82) ఇంటి వద్దకు వచ్చి క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యకు యత్నించాడని పోలీసులు తెలిపారు. తాలుకా పోలీసులు కథనం మేరకు మదనపల్లె మండలం కొత్తవారిపల్లె గ్రామం ఎనుములవారిపల్లె వాసి కోలా రెడ్డెప్ప, అతడి భార్యపై అదే గ్రామానికి చెందిన వేణు, అతడి భార్య కాంతమ్మ, ఉదయ్ అతడి భార్య రేణుక, జగదీష్ (నాని), దాడి చేసి గాయపర్చారు. 2023లో తన కుమారుడు సోముశేఖర్ పేరిట గుర్రప్ప వద్ద 63 సెంట్లు కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నట్లు బాధితుడు తెలిపారు. అదే గ్రామానికి చెందిన వేణు వర్గీయులు ఆ భూమిని తమకు అమ్మాలని అడిగారు. ఇవ్వమని తెలపడంతో బుధవారం పొలం పనులు చేస్తున్న వృద్ధులపై దాడి చేశారు. తాము కొనుగోలు చేసిన పొలంలోకి దౌర్జన్యంగా జొరబడి దాడి చేశారని బాధితుడు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధ దంపతులపై చేసిన దాడిని అవమానంగా భావించిన వృద్ధుడు ఇంటి వద్దకు వచ్చి క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 9 మంది తమిళ స్మగ్లర్లు అరెస్ట్

● 12 దుంగలు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి


పట్టుబడ్డ స్మగ్లర్లు, దుంగలతో ఎస్పీ ధీరజ్, పోలీసు సిబ్బంది

రాయచోటిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పరిధిలోని టి.సుండుపల్లె మండలం మాచిరెడ్డిగారిపల్లె అటవీ ప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న 9 మంది తమిళ స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.34.40 లక్షల విలువ చేసే 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ ధీరజ్ కునుబల్లి ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఆర్ఎస్‌టీఎఫ్ సీఐ మధు, కలికిరి సీఐ అనిల్‌తో పాటు టి.సుండుపల్లె పోలీసులు, ఆర్ఎస్‌టీఎఫ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సుండుపల్లె మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లెకు సమీపంలోని తొగురుపల్లి క్రాస్‌కు సమీపంలోని తొగురుపల్లి క్రాస్ వద్ద ఎర్రచందనం దొంగల కోసం కాపు కాపు కాశారని ఎస్పీ తెలియజేశారు.

ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో మాచిరెడ్డిగారిపల్లె వైపు నుంచి ఒక కారు రాగా స్మగ్లర్లు మామిడి తోట నుంచి ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేయడానికి ప్రయత్నించారన్నారు. అప్పటికే నిఘాలో ఉన్న పోలీసు బృందాలు వారిని అడ్డుకోవడానికి ముందుకు వెళ్లగా కొంత మంది కారులో ఎక్కి పోలీసులను ఢీకొట్టే ప్రయత్నం చేసి తప్పించుకున్నారన్నారు. అయితే పోలీసులు వారిని వెంబడించి తమిళనాడు రాష్ట్రానికి చెందిన బాకియారాజ్, రజిత్‌కుమార్‌గోవిందన్, స్వామినాధన్, సురేశ్ కుమార్ శివకుమాదర్, దురై స్వామి, రాజామణి, పరశాంతు చంద్రన్, రాజా విజయ్‌కుమార్, తిరుమలై చిన్నయాన్ అనే 9 మంది ఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులు వెంటాడి పట్టుకున్నారన్నారు. వారి వద్ద నుంచి 34.40 లక్షల విలువ గల 344 కిలోల బరువు గల 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపెట్టనున్నట్లు ఎస్పీ వివరించారు. పారిపోయిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.

## తలకోన వద్ద 10 ఎర్రచందనం దుంగల స్వాధీనం


పట్టుబడిన స్మగ్లరు, వాహనం, దుంగలు

పీలేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న తమిళనాడుకు చెందిన స్మగ్లరుతో సహా ఒక వాహనం, 10 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు... తలకోన అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం ఉదయం తిరుపతి జిల్లా యల్లమంద, చిత్తూరు జిల్లా పులిచెర్ల, మంగళంపేట రోడ్డు మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో పులిచెర్ల మార్గంలో వేగంగా వస్తున్న ఒక ఫోర్డు ఎకోస్పోర్ట్స్(ఏపీ03 బీజే 1555) వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 10 ఎర్రచందనం దుంగలు గుర్తించినట్లు తెలిపారు. దీంతో ఆ వాహనంతో సహా అందులో ఉన్న తమిళనాడు రాష్ట్రం, సేలం జిల్లా తెక్కంపట్టి గ్రామానికి చెందిన ఇళయరాజాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దాడిలో ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్ఎస్‌వో ప్రకాశ్ కుమార్, ఎఫ్‌బీవోలు ప్రతాప్, రెడ్డిప్రసాద్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

## ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్త ఉద్యమం

**● బాస్ నేషనల్ కో-ఆర్డినేటర్ దుర్గం సుబ్బారావు**


మాట్లాడుతున్న దుర్గం సుబ్బారావు

మదనపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల సాధనకోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టనున్నట్లు బాస్ నేషనల్ కో-ఆర్డినేటర్ దుర్గం సుబ్బారావు ప్రకటించారు. పూనా ఒప్పంద దుర్దినం సెప్టెంబరు 24వ తేదీని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో బాస్, వీసీకే పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో 'రాజ్యాంగం-రాజకీయ హక్కులు-ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రైవేటు రంగంలో ప్రాతినిధ్య రిజర్వేషన్లను గురించి సమగ్రంగా వివరించారు. వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ పోరాడి సాధించిన ప్రత్యేక నియోజకవర్గాలను పూనా ఒప్పందంలో కోల్పోయామన్నారు. ప్రముఖమైన, ప్రధానమైన వివిధ రంగాలను ప్రైవేటుపరం చేయడంతో 85 శాతం విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రైవేటు రంగంలోకి వెళ్లిపోయాయని, ప్రభుత్వం వద్ద ఉన్న 15 శాతం కూడా ఆ వర్గాలకు దక్కలేదని వివరించారు. ఆ అవకాశాలు పూర్తిస్థాయిలో అర్హులకు దక్కేలా దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు. సమావేశంలో కె.వి.రమణ, పల్లం తాతయ్య, ముత్యాల మోహన్, పి.శ్రీనివాసులు, కడప రమణ, నంద్యాల శ్రీపతి, నీరుగట్టి రమణ, పీర్‌బాషా, వి.దొరస్వామి, ఓబులేసు, కర్ణాటక మునెప్ప, మునివెంకటప్పతో పాటు అన్నమయ్య, చిత్తూరు, కడప, తిరుపతి, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన వీసీకే, బాస్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


## మొటుకుపల్లె చెరువుకు గండి

**● మరమ్మతులు చేసిన స్థానికులు**


చెరువు కట్టకు మరమ్మతు పనులు చేస్తున్న రైతులు

మదనపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మొటుకుపల్లె-ముడివారిపల్లె సమీపంలోని వాయలపాటువానిచెరువుకు గండి పడింది. కర్ణాటక సరిహద్దు అటవీ ప్రాంతంలో ఇటీవల వర్షాలు ఎక్కువగా కురిశాయి. దీంతో పైప్రాం తం నుంచి వచ్చిన వర్షపునీటితో చెరువునిండి మొరవపోయింది. అయితే అప్పటికే చెరువుకట్ట బలహీనంగా ఉండడంతో వర్షపు నీరు చేరడంతో లీకేజీ ప్రారంభమైంది. రైతు లు దీనిని మొదట్లో సాధారణ లీకేజీగా పరిగణించారు. అయితే పైప్రాంతంలోని కొండలు, గుట్టల నుంచి నీరు యధావిధిగా రావడంతో లీకేజీ అంతకంతకూ పెరుగుతూ గండి పడింది. దీనిని గమనించిన స్థానిక రైతులు ఈ విషయాన్ని మొటుకుపల్లె టీడీపీ నేత, రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి మొటుకుపల్లె శివ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన సొంత నిధులు వెచ్చించి తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. ఇందులో భాగంగా ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌తో మట్టిని తరలించి స్థానిక రైతుల సహకారంతో గండిని పూ డ్చి నీటి లీకేజీని ఆపేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇందులో మొటుకు శి వ, శంకర్, అంజనప్ప, సోమశేఖర్, వెంకటరణ, బద్దుల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. భవిష్య త్తు వర్షాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# పసుపులో అంతరపంటగా బొప్పాయి


పసుపులో అంతరపంటగా సాగు చేసిన బొప్పాయి


● డ్రిప్‌తో కళకళలాడుతున్న తోటలు

దువ్వూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పసుపు సాగులో రైతులు కొత్తపద్ధతులు అవలంబిస్తున్నారు. పసుపుతో పాటు అంతర పంటగా బొప్పాయి సాగు చేపడుతు న్నారు. డ్రిప్ ఏర్పాటు చేసి నీటి తడులు అందించ డంతో తోటలు ఏపుగా పెరిగి కళకళలాడుతున్నాయి.

మైదుకూరు ప్రాంతం పసుపు సాగుకు పెట్టింది పేరు. ఇక్కడ పండిన పసుపు పంట నాణ్యత పరంగా వ్యాపారులను ఆకర్షిస్తోంది. దువ్వూరు, ఖాజీపేట, మైదుకూరు, చాపాడు మండలాల్లో విస్తృతంగా ఈ పంటను సాగుచేశారు. పంట సాగుకు ఖర్చులు పెరిగిన నేపధ్యంలో సైతం పంట వేసేందుకు రైతులు వెనుకాడటం లేదు. మార్కెట్‌లో వట్టి పసుపునకు డిమాండ్ ఉండడం, మంచి ధరలు పలకడంతో రైతులు ఈ సంవత్సరం కూడా పసుపు సాగుకు ఎక్కువ ఆసక్తి కనపరిచారు. దువ్వూరు మండలంలో కిందటి సంవత్సరం 582 ఎకరాల్లో సాగైనట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. ఈ సంవత్సరం అదనంగా మరో వంద ఎకరాల్లో విస్తీర్ణం పెరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇక ఈ ఏడాది రైతులు పసుపులో అంతర పంటగా బొప్పాయిని సాగు చేశారు. తద్వారా తెగుళ్ల నివారణకు ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఇక పసుపు పంటలో డ్రిప్ విధానం అవలంబించేందుకు రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. తద్వారా తోటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వచ్చేందుకు తోడ్పడుతుందని అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుతం డ్రిప్ ఏర్పాటు చేసిన తోటలు కళకళలాడుతున్నాయి.

**డ్రిప్‌తో బహుళ ప్రయోజనాలు**

పసుపు సాగులో డ్రిప్ ఏర్పాటు చేయడం వలన ప్రయోజనాలు మెండుగా ఉన్నాయి. నేరుగా మొక్కకు నీరు అందుతుంది. నీటి వృథాను అరికట్టవచ్చు. ఎరువులను మొక్కకు అందేటట్లు చేయవచ్చు. కలుపు తగ్గుతుంది. ఖర్చులు ఆదా అవుతాయి. దిగుబడి పెరిగి రైతుకు లాభసాటిగా ఉంటుంది.

- రామకృష్ణ, ఉద్యానవన శాఖ అధికారి, మైదుకూరు

## బోధనలో కృత్రిమ మేధ వినియోగం అవసరం

● వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ)ను బోధన, పరిశోధనలో వినియోగిస్తే విద్యార్థుల్లో ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెరుగుతుందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పీఎం ఉష విభాగం ఆధ్వర్యంలో క్రియాశీల బోధన కోసం ఏఐ సాధనాలు అనే అంశంపై జాతీయస్థాయి ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ విద్యార్థులు, అధ్యాపకుల జ్ఞానాన్ని విస్తరించడంలో తోడ్పడుతుందని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఎస్వీయూ ప్రొఫెసర్ డాక్టర్ జీవీ రమేష్‌బాబు ఏఐ ప్రాధాన్యతను వివరించారు. పీఎం ఉష ప్రాజెక్టు కింద యూనివర్సిటీకి రూ.20కోట్లు మంజూరైనట్లు సమన్వయకర్త డాక్టర్ టి.చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్.సునీత, డాక్టర్ కె.లలిత, డాక్టర్ పి.సరితలు సమన్వయం చేశారు.

## పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

● జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్

దువ్వూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడుకోవడం వలన రైతులకు ప్రయోజనం ఉంటుందని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ తెలిపారు. గుడిపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి జొన్నపంటలను పరిశీలించారు. ఎరువులను మోతాదుకు మించి వాడవద్దని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడక విధానం అవలంభించాలని తెలిపారు. ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ పోరెడ్డి వెంకటరమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## అక్టోబరు 31 వరకు గడువు పొడిగింపు

సీకేదిన్నె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో కాలేజీ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ ప్రవేశాలకు దరఖాస్తుల గడువును అక్టోబరు 31 వరకు పొడిగించినట్లు కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల ప్రవేశానికి ఎంసెట్ ర్యాంకుతో అవసరం లేదని, ఇంటర్ ఎంపీసీ లేదా బైపీసీ, రెండు సంవత్సరాలు పాలిటెక్నిక్ డిప్లమో హోంసైన్స్ కానీ, సీడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్, హార్టికల్చరల్, వెటర్నరీ, అగ్రికల్చలర్ ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్, పాలిటెక్నిక్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు లభిస్తాయన్నారు. గుంటూరులో హాస్టల్ వసతితో కూడిన భోధన, శిక్షణ ఉంటుందని.. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## 27న బ్యాడ్మింటన్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27న శనివారం ఉదయం 9గంటలకు స్కూలు గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 బ్యాడ్మింటన్ (షటిల్) ఎంపికలు జరగనున్నట్లు జిల్లా సెక్రటరీ సీఎం రాజు తెలిపారు. జిల్లాలోని ఔత్సాహిక క్రీడాకారులు తమ బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్ తప్పక వెంట తీసుకురావాలని కోరారు.

# మహిళల హక్కుల కోసం.. ముప్పై ఏళ్లుగా పోరాటం

● కరువుకు బలి అవుతున్నది సీమ ఆడబిడ్డలే ● చైతన్య మహిళా సంఘం కన్వీనర్ జ్యోతక్క



చైతన్య మహిళా సంఘం ర్యాలీలో పాల్గొన్న రెండు తెలుగురాష్ట్రాల మహిళా నేతలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో మహిళల హక్కుల కోసం మూడు దశాబ్దాలుగా ఎన్నో రాజ్య నిర్బంధాలను ఎదుర్కొంటూ అలుపెరుగక పోరాడుతున్న సంస్థ చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) అని ఆ సంఘం తెలుగు రాష్ట్రాల కన్వీనర్ జ్యోతక్క పేర్కొన్నారు. బుధవారం చైతన్య మహిళా సంఘం ఆవిర్భవించి మూడు వసంతాలు పూర్తయిన సందర్భంగా స్థానిక రామేశ్వరం రోడ్డులోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో రాష్ట్ర మహిళా సదస్సు జరిగింది. ఈ సదస్సులో జ్యోతక్క మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అనేక మహిళా సంఘాలు సమాఖ్యగా ఏర్పడి చైతన్య మహిళా సంఘంగా 1995లో తిరుపతిలో ఆవిర్భవించిందన్నారు. దీనికి దూబగుంట మహిళల సారా ఉద్యమ స్ఫూర్తే కారణమన్నారు. వరకట్న హత్యలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు సాగించి ఎందరో మహిళలకు అండగా నిలిచిందన్నారు. రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలతో కలిసి పనిచేసిందన్నారు. సభకు అతిథిగా పాల్గొన్నా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాలు మహిళలను అణిచివేసే సాధనాలన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న వారిలో కూడా ఈ మూఢనమ్మకాలు అంధవిశ్వాసాలు వుంటున్నాయన్నారు. భారత దేశం ప్రపంచంతో పాటి ఎదగకపోవడానికి ఇవే ప్రధాన కారణమన్నారు. డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ గీత మాట్లాడుతూ భ్రూణహత్యల వల్ల స్త్రీ పురుషుల రేషియో తగ్గి వివాహాలు కాని పరిస్థితి ఏర్పడుతుందన్నారు.. ఎన్జీవో మహిళా చైర్‌పర్సన్ జయమ్మ మాట్లాడుతూ ఉద్యోగ రంగంలో మహిళలకు అన్యాయాలు జరుగుతున్నాయన్నారు. ఏపీ రాష్ట్రకన్వీనర్ రాధ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలకు పర్మిట్ రూములిచ్చి, బార్లను అర్ధరాత్రి వరకు తెరిచి ప్రభుత్వాలు ఖజానాలు నింపుకుంటూ మహిళలకు సంక్షేమాన్ని అమలు చేస్తున్నామనడం ఎంతవరకు సమంజసమన్నారు. విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ సెక్స్ ట్రాఫికింగ్‌లకు హాట్‌స్పాట్‌లుగా రాయలసీమ కరువు ప్రాంతాలు వున్నాయన్నారు. ఏ పార్టీ అయినా సీమలో కరువు నిర్మూలన కోసం పాటుపడటం లేదన్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నేతల సందేశాలు మహిళల హక్కుల పోరాటంలో తమ సంఘీభావం ప్రకటించాయి. కార్యక్రమంలో సీఎంఎస్ జిల్లా కన్వీనర్ పద్మ, ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా కన్వీనర్ సురేష్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు రషీద్, మహిళాశక్తి రాష్ట్ర కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, యువ న్యాయవాది హరిత, రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ మహమూద్, దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ, పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, జమాతే ఇస్లాం మహిళా కన్వీనర్ రెహనా, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సభలో ప్రజాకళామండలి కళాకారుల పాటలు సభికులను ఉత్తేజపరిచాయి.


మాట్లాడుతున్న జ్యోతక్క

## కారు ఢీకొని బాలిక మృతి



చాపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగురవలూరు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం గొల్లపల్లె దక్షిణి (6) అనే బాలికను కారు ఢీకొనడంతో మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు... బి.మఠం మండలం నందిపల్లె గ్రామానికి చెందిన గొల్లపల్లి రాజు చిన్నగురవలూరులోని ఓ వివాహ కార్యక్రమానికి తన కూతురుతో కలిసి హాజరయ్యారు. పెళ్లి కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఇంటికి వెళుతుండగా వాహనాలు నిలిపిన చోట ఒక కారు రివర్స్ తిప్పుతుండగా దాని వెనుక ఉన్న బాలిక ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. తలకు, ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో చికిత్స కోసం ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వివాహిత ఆత్మహత్య



కడప క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సాయిపేట ఆటో స్టాండు ఏరియాకు చెందిన వివాహిత గురువారం తెల్లవారు జామున ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. సాయిపేటకు చెందిన పఠాన్ నసీంఖాన్ (42) ఆమె భర్త ఆరిఫుల్లాఖాన్ మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం ఆరిఫుల్లాఖాన్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. ఈ నేపధ్యంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నసీంఖాన్ ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు.

## గాయపడ్డ టీడీపీ కార్యకర్తమృతి


నాగేంద్ర (ఫైల్)

కలసపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులతో కలిసి పెళ్లిచూపులకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టీడీపీ కార్యకర్త ఎల్లనూరు నాగేంద్ర (30) చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కలసపాడు మండలం లింగారెడ్డిపల్లె నుంచి గిద్దలూరుకు సోమవారం తల్లిదండ్రులతో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సంజీవరాయునిపేట వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా నాగేంద్ర మృతి చెందాడు. తల్లిదండ్రులు అక్కడే చికిత్స పొందుతు న్నారు. నాగేంద్ర మరణవార్త తెలిసిన రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా రహంతుల్లా, నీటి సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి, యువ నాయకుడు స్వామిరంగారెడ్డి, మాజీ సైనికుడు మస్తాన్, గ్రామ స్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# భిన్నత్వంలో ఏకత్వమే యూఎస్‌వో లక్ష్యం

● రేపటి నుంచి పులివెందులలో జాతీయస్థాయి స్కూల్స్ ఫెస్టివల్ ● యూఎస్‌వో సెక్రటరీ నీనా జైన్


సమావేశంలో మాట్లాడుతున్న నీనా జైన్

పులివెందుల రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలోని వివిధ సంస్కృతులు, సాంప్రదాయలు కలిగిన విద్యార్థులను ఒక్కచోటకు చేర్చి భిన్నత్వంలో ఏకత్వం చేయాలన్నదే యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (యుఎస్ఓ) లక్ష్యమని ఆ సంస్థ సెక్రటరీ నీనా జైన్ స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ ఇస్టా కార్యాలయంలో సంస్థ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ భానుప్రకాష్, ట్రెజరర్ విజయ్‌కుమార్ నెహ్రాతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ సంస్థ 75 ఏళ్లుగా 31 వేల పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తోందన్నారు. ఈసారి పులివెందులలో జాతీయస్థాయి స్కూల్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో 9 రాష్ట్రాలకు చెందిన 17 సంవత్సరాల లోపు పిల్లలు 150 మంది పాల్గొంటారన్నారు. ఆయా రాష్ట్రాలలోని సంస్కృతి, సంప్రదాయాలు, వేషధారణలు ప్రదర్శించనున్నారన్నారు. అలాగే వీరికి వకృత్వ, క్విజ్, జనరల్ నాలెడ్జ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇక విహారయాత్రలో భాగంగా గండికోట, యూసీఐఎల్‌ను సందర్శించడం జరుగుతున్నారు. పిల్లల్లోని దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏర్పాటుచేస్తున్న ఈ ఫెస్టివల్‌ను జయప్రదం చేసేందుకు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యలను ప్రస్తావించాలి

● జగన్‌కు తులసిరెడ్డి సూచన

వేంపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లి రాష్ట్రంలో ప్రజల సమస్యలను ప్రస్తా వించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. ప్రతిపక్ష హోదా కావాలని మంకు పట్టుపట్టడం హాస్యాస్పదమని, అసెంబ్లీకి వెళ్లని పక్షంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వేంపల్లెలో బుధవారం విలేకరుల సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడుతూ 11 సీట్లు వచ్చిన వైసీపీకి ప్రతిపక్ష హోదా రాదని తెలిసి కూడా ఉద్దేశపూర్వకంగా జగన్ అసెంబ్లీకి వెళ్లకపోవడం ప్రజాస్వా మ్యా న్ని అవమానించడమే అన్నారు. గతంలో కాంగ్రెస్‌కు కూడా ప్రతి పక్ష హోదా ఇవ్వలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తాత్సారం చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు జగన్ అసెంబ్లీకి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

## పేదలకు జీఎస్టీ మినహాయించాలి

ప్రొద్దుటూరుటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినా కొన్ని వస్తువులకే తగ్గింపు ధరలు అమలు అవుతున్నాయని, అందువలన రేషన్‌కార్డు ఉన్న పేదలకు జీఎస్టీ మినహాయించాలని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో వివిధ కార్పొరేషన్లకు బడ్జెట్ కేటాయించకపోవడం వలన వెనుకబడిన అణగారిన వర్గాల ప్రజలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొరేషన్లకు తగిన బడ్జెట్ కేటాయించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ పథకానికి దళిత, గిరిజన మహిళలు భూమి కొనుగోలు పథకాన్ని అనుసంధానం చేసి, యూనిట్ ధరను ఎకరాకు 20 నుండి రూ.50 లక్షలకు పెంచాలన్నారు. ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు డానియేల్ మాదిగ, బాలలక్షుమయ్య మాదిగ, కర్ణమాదిగ, నాగభూషణం మాదిగ పాల్గొన్నారు.

# పిల్లల విద్య ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ వహించాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్


అధికారులతో చర్చిస్తున్న జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాలలోని పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగు శ్రద్ధ వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని విజిట్ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను, వంట గదులను, భోజన సదుపాయాన్ని, రికార్డులను పరిశీలించారు.

అనంతరం జడ్జి మాట్లాడుతూ విద్య విలువైనదని, క్రమశిక్షణతో అభ్యసించి గురువులకు, సమాజానికి మంచి పేరు తేవాలన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024పై వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ 14456 మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో నిర్వహించిన జిల్లా అధికారుల మానిటరింగ్ సమావేశంలో హిట్ అండ్ రన్ కేసులలో పరిహారం, చెల్లింపు మొదలగు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కడప, రాజంపేట డివిజన్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారులు, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# భిక్షాందేహి... కృపావలంబనకరీ

## వేడుకగా శరన్నవరాత్రోత్సవాలు ● ఆలయాల్లో కొలువైన అన్నపూర్ణా దేవి ● మహిళలతో కిటకిటలాడిన ఆలయాలు



అన్నపూర్ణాదేవిగా యల్లమ్మ తల్లి (కలికిరి )

పీలేరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్యరత్నాకరీ..., నిర్ధూతాఖిలదోష పావనకరీ ప్రత్యక్షమాహేశ్వరి...., ప్రాలేయాచలవంశ పావనకరీ కాశీపురాధీశ్వరీ..., భిక్షాందేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ అంటూ అన్నపూర్ణాదేవిని పూజిస్తూ 'అన్నపూర్ణా దేవి అర్చింతుమమ్మా, మా మనవి ఆలించి మము బ్రోవుమమ్మా' అంటూ అన్నపూర్ణా దేవి అలంకరణలో దర్శనమిచ్చిన పీలేరు గ్రామ దేవత రౌద్రాల అంకాళమ్మను కొనియాడారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అంకాళమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమివ్వగా మహిళలు పెద్దఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. నెహ్రూ బజారులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు మీనాక్షి అలంకరణలో దర్శనమిచ్చారు. మోడల్ కాలనీలోని ఎల్లమ్మ తల్లి, ఇందిరమ్మ కాలనీ సమీప దిన్నె గంగమ్మ ఆలయం, తలపుల సమీపంలోని ఉలవల గంగమ్మ, బండ్లవంకలోని నడివీధి గంగమ్మ, తిరుపతి రోడ్డులోని చౌడేశ్వరి దేవీ, అగ్రహారం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం రౌద్రాల అంకాళమ్మ ఆలయంలో అర్చకులు మహిళలతో సామూహిక కుంకుమార్చన చేయించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ కె.రామకృష్ణా రెడ్డి, ఈఓ మంజుల, సభ్యులు షామియాన జయన్న, భాస్కర రెడ్డి, శేఖర, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

### వాల్మీకిపురంలో....

వాల్మీకిపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి వేడుకల్లో మూడోరోజు అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వానరగుట్ట ప్రాంతం నల్లవీరగంగా భవాని, చింతపర్తి వాసవీ అమ్మవారు, గండబోయనపల్లె కోటలో వెలసిన సత్యమ్మతల్లి దేవత, వాల్మీకినగర్‌లోని బోయకొండ గంగమ్మ దేవాలయాల్లో అమ్మవార్లను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి రాజరాజేశ్వరిదేవిగా, బజారు వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి గజలక్ష్మీ దేవి అలంకరణ, రాత్రికి గజవాహన సేవ, విశేష పూజలు జరిగాయి.



బి.కొత్తకోటలో అన్నపూర్ణా దేవి అలంకరణలో దుర్గామాత

### లలితా త్రిపుర సుందరి దేవిగా....

కలకడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కోన గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ దేవి అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, తదితర పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రజలు అధిక సంఖ్యలో ఆశీస్సులు పొందారు.

### అన్నపూర్ణాదేవిగా కలికిరి యల్లమ్మ తల్లి

కలికిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పురాతన గ్రామ దేవత యల్లమ్మ తల్లి అన్నపూర్ణాదేవి అవతారంలో సాక్షాత్కరించింది. వివిధ రకాల సంప్రదాయ ఆహార పదార్థాలు, పండ్లు అమ్మవారికి అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సోమేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవి మహిషాసురమర్దనిగా సప్తమాతృకలతో కొలువుదీరింది.

### లలితా త్రిపుర సుందరీ దేవీ నమోస్తుతే...

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్ పురాణం చంద్రశేఖర్, బండి పవన్‌కుమార్, రామిశెట్టి రత్నమయ్య తదితర కమిటీ పర్యవేక్షించింది. సాయంత్రం కుంకుమ అలంకరణతో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మోడెం వెంకటరమణ, ఉపాధ్యక్షులు మోడెం సిద్దప్ప, ఉప్పు రామచంద్ర, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి ఆంజనేయులు, తదితరులు పర్యవేక్షించారు. కోర్టులో గంగమ్మకు విశేష పూజలు చేశారు. సాయంత్రం స్వర్ణకవచ అలంకరణలో భక్తులకు గంగమ్మను దర్శనం కల్పించారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. వాసవీ భవన్ వీధిలోని కన్యకాపర మేశ్వరీ దేవి ఆలయంలో లలిత సహస్రనామార్చనలో మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం మీనాక్షి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమాలను మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్ పర్యవేక్షించారు. దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో మూల విరాట్టును అభిషేకించి, ప్రత్యేక పూలతో అలంకరించారు. ఆలయ ఈఓ రమణ, సిబ్బంది, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు బిజే పాండు, విశ్వబ్రహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ పర్యవేక్షించారు. సోమేశ్వర స్వామి ఆలయంలో మహిళలు, భక్తులు పోటెత్తారు. దేవతా నగర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయంలో ధర్మకర్త పతంజలి స్వామి ఆధ్వ ర్యంలో లలితా త్రిపుర సుందరీ అలంకరణ చేసి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. బాట గంగమ్మ ఆలయంలో దేవీ శర్నవరా త్రులు ధర్మకర్త బొగ్గిటి అలివేలమ్మ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేసి విశేష పూజలు చేశారు.

### అన్నపూర్ణా దేవిగా రెడ్డెమ్మ తల్లి

గుర్రంకొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పూలతో అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. గుర్రంకొండ, కొత్తపేటలో కొలువైన పోలేరమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను కరుణించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు.

### అన్నపూర్ణేశ్వరి అలంకరణలో మాతమ్మతల్లి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దహరిజనవాడ మాతమ్మతల్లి అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయానికి పూజలు నిర్వహించారు. ఈ ఏడాది ఆలయం ముందు అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేయడంతో అధిక సంఖ్యంలో భక్తులు హజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు.



అన్నపూర్ణాదేవిగా పోలేరమ్మ తల్లి (గుర్రంకొండ)

### తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శివాలయంలో కొలువు దీరిన పార్వతీ దేవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అర్చకుడు మహేష్ అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

### ములకలచెరువులో...

ములకలచెరువు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### పార్వతీ మాతా నమోస్తుతే...

బి.కొత్తకోట, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ నడిబొడ్డున దుర్గామాత ప్రతిమను ప్రతిష్ఠించి వైభవంగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు చేయించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అన్నసంతర్పణ నిర్వహించారు. దిగువ బస్టాండులో ఉన్న కాళీమాత ఆలయంలో మూడోరోజు పార్వతీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. ఉభయదారులుగా పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు పాంచాననం సువర్ణాచారి కుటుంబీకులు వ్యవహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అన్నపూర్ణా దేవి అలంకరణలో నల్లవీరగంగాభవాని, సత్యమ్మతల్లి, వాసవీ అమ్మవారు (వాల్మీకిపురం) - మీనాక్షి అలంకారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు ( పీలేరు ) - అన్నపూర్ణేశ్వరి అలంకరణలో మాతమ్మతల్లి (నిమ్మనపల్లి) - కుంకుమ అలంకరణలో చౌడేశ్వరీ మాత - రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో లలిత త్రిపురసుందరి అలంకరణ (మదనపల్లె) - శైలపుత్రి అలంకరణలో వాసవీ అమ్మవారు (ములకలచెరువు) - కోన చౌడేశ్వరి అమ్మవారు (కలకడ)

## నాణ్యమైన వైద్యసేవలందించడమే లక్ష్యం

● టాటా టెలికన్సల్టేషన్ ప్రారంభించిన ముంతాజ్‌అలీ



వాహనాన్ని ప్రారంభిస్తున్న ముంతాజ్‌అలీ

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా స్వాస్థ్య ఆస్పత్రి పనిచేస్తోందని పద్మభూషణ్, యోగా గురువు ముంతాజ్‌అలీ(శ్రీఎం) పేర్కొన్నారు. బుధవారం స్థానిక సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ్య ఆస్పత్రి ఆధ్వర్యంలో టాటా టెలికన్సల్టేషన్ ద్వారా ఉచిత వైద్య సేవలందించే వాహనాన్ని శ్రీ ఎం ప్రారంభించారు. చైర్మన్ గిరీష్ కృష్ణమూర్తి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రవి, ఏఓ కరుణాకర్, ఆర్ఎంఓ ఆదర్శ్, పాల్గొన్నారు.



## తప్పులు లేని జాబితా తయారు చేయండి

పీలేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రమాణాలు పాటిస్తూ తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పన చేయాలని బీఎల్‌ఓలకు తహసీల్దారు శివకుమార్ సూచించారు. ఓటరు జాబితా తయారీపై ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణలో ఆయన మాట్లాడుతూ 2002 ఓటర్ల జాబితా ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్లను 2025 ఓటర్ల జాబితాతో సరిపోల్చి చూడాలన్నారు. 26లోపు సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ రాజేశ్వరి, రిసోర్స్ పర్సన్‌లు సురేశ్, గీతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భార్యపై రసం పోసిన భర్త

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త కాలే రసం పోసి హత్యాయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. కురవంక వాసి రామంజులు భార్య భారతి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వీరభద్ర వద్ద పని చేస్తోంది. భార్యపై అనుమానంతో ఈ రోజు సాయంత్రం జిల్లా ఆస్పత్రిలో బక్కెట్‌తో కాలేరసం పోసి భర్త హత్యాయత్నానికి పాల్పడాడు. బాధితురాలిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఇరువర్గాల ఘర్షణ - కేసు నమోదు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సోమానపల్లికి చెందిన తుపాకుల సుగుణ, సుప్రియ ఇంటి విషయమై తగాదాపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకుని ఘర్షణ పడ్డారు. ఈ తగాదాలో ఇరు వర్గాలకు గాయాలు కావడంతో మదనపల్లికి తరలించి చికిత్స అం దించినట్లు తెలిపారు. పరస్పర ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## విద్యార్థుల సేవలు అవసరం

వాల్మీకిపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజ స్థాపన కోసం విద్యార్థులు 'మై భారత్ వలంటీర్' సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. స్వస్త నారి స శక్త్ పరివార్‌లో భాగంగా వాల్మీకిపురం పీవీసీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీబీ లేని సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు వలంటీర్లుగా చేరి సేవల పట్ల ఎలా సన్నద్ధం కావాలని అవగాహన కల్పిస్తూ ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి, డిప్యూటీ హెల్త్‌ఎడ్యుకేషన్ ఆఫీసర్ మొహ్మద్‌రఫీ, టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, వైద్య సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలకు రూ.50వేలు విరాళం



విరాళం అందిస్తున్న కల్పనారెడ్డి

బి.కొత్తకోట, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): జ్యోతి సర్కిల్‌లో మన ఊరి పండుగ పేరుతో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలకు తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి సతీమణి కల్పనారెడ్డి రూ.50వేల విరాళం అందజేశారు. బుధవారం సాయంత్రం ఆమె ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం నిర్వాహక కమిటీ ప్రతినిధులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో చిట్టా రామక్రిష్ణారెడ్డి, చింతలకిరణ్, కుడుంశరత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, టీడీపీ నేతలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికలకు సమరానికి సిద్ధంగా వుండాలని రాష్ట్ర తెలగు యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు పేర్కొన్నారు. బుధవారం రాచవేటివారిపల్లి గుండ్లబురుజులో పర్యటించిన ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం కేసులో వైసీపీ నేతలంతా జైలు పాలవుతుంటే జగన్‌కు జైలు భయం పట్టుకుందన్నారు. స్థానిక ఎన్నికలకు తెలుగు తమ్ముళ్లు అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి సిద్ధంగా వుండాలని పిలుపు నిచ్చారు. రాజంపేట అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్, నేతలు ఉదయ్, శివ, శ్రీనివాస్, బీజేపీనేత శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాలను గుర్తించాలి

మదనపల్లె టౌన్/పెద్దమండ్యం/పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించినట్లు పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శకాల ప్రకారం బంగారు కుటుంబాలను గుర్తించాలని జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి లక్ష్మీపతి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్‌లతో మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన వున్న వారిని గుర్తించాలన్నారు. విద్యతో పాటు, అన్ని విధాలా బంగారు కుటుంబం సభ్యులకు చేయూతనిచ్చేలా మార్గదర్శకులు (ఆర్థిక సహాయం చేసేవారు) అవగాహన కల్పించాలన్నారు. డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. పేద కుటుంబాలకు బంగారు బాటలు వేయాలి

● పెద్దమండ్యం పేద కుటుంబాలను ఆర్థికంగా బంగారు కుటుంబాలుగా మార్చాలని ఎంపీడీఓ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో పీ-4 పై సమావేశమైన వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి ప్రత్యేక అవసరాలను గుర్తించి నివేదికను సిద్ధం చేయాలన్నారు.

● రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పీ-4 సర్వేను ప్రవేశ పెట్టిందని పెద్దతిప్పసముద్రం ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ అన్నారు. కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పీ-4పై మండల స్థాయి విజన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ బూర్లపల్లె పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ అధ్వర్యంలో శిక్షణ చేపట్టారు.

## ముర్రుపాలతో రోగనిరోధకశక్తి పెరుగుదల



బిడ్డల తల్లులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ముర్రుపాలతో బిడ్డల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందని సీడీపీఓ నాగవేణి పేర్కొన్నారు. బుధవారం మదనపల్లె అర్బన్ సెక్టార్‌లోని అప్పారావుతోట అంగన్‌వాడీ సెంటర్లో రాష్ట్రీయ పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాపించాలన్నారు. బిడ్డకు తల్లిపాలను రెండేళ్లపాటు తాపించాలని సూచించారు. ఏసీడీపీఓ సునీత మాట్లాడుతూ బిడ్డలకు ఆరు నెలలు నిండాక ఎలాంటి ఆహారం తినిపించాలి, వాక్సిన్, టీకాలపై వివరించారు. అంగన్‌వాడీల్లో పంపిణీ చేస్తున్న బాలామృతం పిల్లలకు తినిపించాలని సూచించారు. అనంతరం బిడ్డల తల్లుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ ప్రమీలరాణి, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, తల్లులు పాల్గొన్నారు.

## గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలి



పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ భాగ్యమ్మ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో విధిగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ భాగ్యమ్మ కార్యకర్తలను ఆదేశించారు. ఆమె పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా కమ్మచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అన్నప్రాసన, పౌష్టికాహార ప్రదర్శన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యకర్తలు ఈశ్వరమ్మ, అమరావతి, అంజనమ్మ, లక్ష్మిదేవి, శారద గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## హంద్రీ-నీవా కాలువకు మరమ్మతులు



బి.కొత్తకోట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాల్వకు అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బడికాయలపల్లి రోడ్డులో హంద్రీనీవా కాల్వ సిమెంట్ లైనింగ్ ధ్వంసమైన విషయం తెలిసిందే. దీంతో పెద్దఎత్తున వరదనీరు కాల్వపై పడడంతో ఓ వైపు కాల్వగట్టు కోసుకుపోయి సిమెంట్ లైనింగ్ దెబ్బతినింది. బుధవారం అధికారులు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఎక్స్‌కవేటర్‌తో దెబ్బతిన్న ప్రాంతాన్ని తొలగించి, గండిని పూడ్చడం, యథాతథంగా సిమెంట్ లైనింగ్ వేయనున్నట్లు తెలిపారు. కాల్వ ఆసాంతం పర్యవేక్షిస్తున్నామని, ఎక్కడ సమస్య వచ్చినా తక్షణం చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ములకలచెరువు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వర్షాలతో టమోటా, మొక్కజొన్న తదితర పంటలు నష్టపోయిన రైతులకు తక్షణం నష్టపరిహారం చెల్లించాలన్నారు. వర్షాలకు సోంపల్లె పంచాయతీలో దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టాలన్నారు.

## ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన షుకూర్



బి.కొత్తకోట, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓగా షుకూర్ బాధ్యతలు చేపట్టారు. మదనపల్లెలో పనిచేస్తూ పదోన్నతిపై ఆయన బి.కొత్తకోటకు వచ్చారు. కాగా ఇక్కడ పనిచేసిన క్రిష్ణవేణి చౌడేపల్లికి యథాస్థానానికి వెళ్లారు.

### ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓగా సిగ్బతుల్లా



పీలేరు, సెప్టెంబరు 24(ఆంధ్ర జ్యోతి): మండల ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓగా దొడ్డిపల్లె పంచాయతీ కార్యదర్శి నాగూరు సిగ్బతుల్లా నియమితులయ్యారు. ఆయనను ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి రాధారాణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం సిగ్బతుల్లా బాధ్యతలు చేపట్టారు. గతంలో పీలేరు డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తుండిన లతీఫ్ ఖాన్ పదోన్నతిపై రామసముద్రం ఎంపీడీఓగా బదిలీ అయ్యారు.

### డిప్యూటీ ఎంపీడీఓగా ఈశ్వర్‌రెడ్డి



తంబళ్లపల్లె, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె డిప్యూటీ ఎంపీడీఓగా ఈశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉన్న ఈఓపీఆర్డీ పోస్టును ప్రభుత్వం ఇటీవల డిప్యూటీ ఎంపీడీఓగా మార్పు చేసింది. ఈ క్రమంలో తంబళ్లపల్లె మండలం పంచాలమర్రి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఈశ్వర్‌రెడ్డికి డిప్యూటీ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీఓ థామస్ రాజ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

## జూదర్లపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): డ్రోన్‌తో తాలుకా పోలీసులు నిఘా ఏర్పాటు చేసి తొమ్మిది మంది జూదర్లను గుర్తించి అందులో ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు. వేంపల్లె పంచాయతీ, కూకటమానుగడ్డ వద్ద జూదం ఆడుతున్న వారిని గుర్తించామని, అందులో ఇద్దరు నిందితులు, రెండు సెల్‌ఫోన్స్, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గుర్రంకొండ నరేంద్ర, జి.వెంకటరమణను అదుపులోకి తీసుకోగా ఎ.రమేశ్, పి.చెన్నకేశవ, బాలక్కగారి రామిరెడ్డి, వంశీ, వెంకట స్వామి, పూస భూపతి, పి.రమేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చాగలమని సీఐ అన్నారు.